ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

తెలుగు దినపత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 9440897445, 8074634674

బుధవారం 03-12-2025 సంపుటి: 27 సంచిక: 221 | Wednesday 03- 12- 2025 Vol.No 27 Issue No .221 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA www.visionandhra.in

# ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాది

- తెలంగాణ ఏర్పాటుకు పునాది పడింది ఇక్కడే
- తెలంగాణ ఇచ్చిన మన్మోహన్ పేరుతో ఎర్త్ వర్సిటీ
- గ్రామాల్లో మంచి సర్పంచ్‌నే ఎన్నుకోండి
- మంత్రులతో కలిసి పనిచేసే వారినే ఆదరించండి
- కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి సిఎం రేవంత్ శంకుస్థాపన





కొత్తగూడెం,డిసెంబర్ 2 : ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్.. అందుకే దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్స్ వర్సిటీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది కూడా పాల్వలంచోలనే అని అన్నారు. రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చిన మన్మోహన్‌సింగ్ పేరుతో ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటు చేసుకోవడం గర్వకారణం అన్నారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. భద్రాచలం రాముల వారి సాక్షిగా చెబుతున్నా.. అన్ని జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత నాది. పాలనకు ఆయువుపట్టయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లా మంత్రుల చేతుల్లోనే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మీరంతా ఓట్లేసి గెలిపిస్తేనే.. ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం అన్నారు. మంచి ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు వస్తాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు కూడా మంచోళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే మంచి సర్పంచి మీ ఊళ్లో లేకపోతే.. గ్రామాలు దెబ్బతింటాయని అన్నారు. రాజకీయ కక్షలు మాని పదేళ్లు అండగా

మిగతా 2లో..

## నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు

- సోనియా, రాహుల్‌లకు అండగా మనమంతా ఉన్నాం
- రాహుల్‌ను ప్రధానిని చేయడమే మన అంతిమ లక్ష్యం
- పార్లమెంట్‌లో ఓట్ చోరీపై చర్చ రాకుండా కుట్రలు
- రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పదేళ్లు పాలించినా ఒక్క ఎయిర్‌పోర్ట్ రాలే
- అభివృద్ధి,సంక్షేమంతో ముందుకు దూసుకెళ్తున్నాం
- పిసిసి సమావేశంలో సిఎం రేవంత్ కీలక ప్రసంగం






హైదరాబాద్,డిసెంబర్ 2 :కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా టీపీసీసీ సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు కీలక సందేశం పంపిస్తూ పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని మోదీ వైఖరి పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ.. కాంగ్రెస్ నాయకత్వానికి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గాంధీని హత్య చేసిన పార్టీ బీజేపీ అని

మిగతా 2లో..

## త్వరితగతిన గ్లోబల్ సమ్మిట్ వేదిక పనులు

- అవసరమైతే మూడు షిప్టుల్లో పనులు చేయండి
- అధికారులను ఆదేశించిన మంత్రి శ్రీధర్‌బాబు
- వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి



హైదరాబాద్,డిసెంబర్ 2 : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ వేదిక వద్ద పనులు చురుకుగా సాగాలని, అవసరమైతే మూడు షిప్టుల్లో పనులు చేపట్టి పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. . మరికొద్ది రోజుల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ వేదికగా జరగనుంది. ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా.. తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా ఈ సమ్మిట్ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి డి.శ్రీధర్ బాబు ఆదేశించారు. మంగళవారం ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న ఈ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా పరిశీలించారు. ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని విభాగాల సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా అప్పగించిన బాధ్యతలు, వాటి పురోగతిపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్షించారు. పలు దేశాలతోపాటు

మిగతా 2లో..


## నడ్డాకు సిఎం, డిప్యూటి సిఎంల శుభకాంక్షలు

అమరావతి,డిసెంబర్ 2 : భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కోసం ప్రార్థిస్తున్నట్లు ట్వీట్ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఆయన పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 'మీ నాయకత్వంలో భాజపా అనేక ఎన్నికల్లో విజయాలు సాధించింది. దేశవ్యాప్తంగా పార్టీ మరింత బలోపేతమైంది. మీ నాయకత్వ పటిమ, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల నిబద్ధత లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.



## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

- ఆ ఉద్యోగులు కంప్యూటర్ పరీక్ష పాసవ్వాల్సిందే!
- ఈ మేరకు ప్రభుత్వం జీఓ నెం. 237 జారీ
- టైపిస్టులు, అసిస్టెంట్లు సహా పలు విభాగాలకు ఈ నిబంధన
- పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోతే చర్యలు తీసుకునే అవకాశం



మిగతా 2లో..

## పవన్ కల్యాణ్ 'దిష్టి' వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ ఫైర్

- పవన్ కళ్యాణ్ 'దిష్టి' వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం
- రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలున్నాయని విమర్శ
- మీ తుపానుకు మేం ఏమీ అనలేదు.. మేమెందుకు దిష్టి పెడతామంటూ ఫైర్
- పవన్ వెంటనే క్షమాపణ చెప్పాలని, చంద్రబాబు స్పందించాలని డిమాండ్



హైదరాబాద్,డిసెంబర్ 2 :ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన 'దిష్టి' వ్యాఖ్యలపై తెలంగాణ ఐటీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి రెండు రాష్ట్రాల మధ్య సౌహార్ద వాతావరణాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. మంగళవారం హుస్నాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి తెలంగాణ ప్రజల దిష్టి తగలడమే

మిగతా 2లో..

## అమిత్ షాతో లోకేశ్ తదితరుల భేటీ

- మొంథా తుఫాన్ నష్టంపై వివరణ
- త్వరగా సాయం కోరిన లోకేశ్
- ఏవియేషన్ సిటీపై జిఎంఆర్ అధికారులతో చర్చ



న్యూఢిల్లీ,డిసెంబర్ 2 : మొంథా తుఫాన్ ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టాన్నే మిగిల్చింది.. ఇప్పటికే ప్రాథమిక అంచనాలపై కేంద్రానికి నివేదిక చేరగా.. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో సమావేశమయ్యారు. మొంథా తుపాను కారణంగా ఆంధప్రదేశ్‌లో భారీ నష్టం జరిగిందని వివరించారు. ఈ నేపథ్యంలో తుపాను నష్టాలపై మంత్రి నారా లోకేష్ పూర్తి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మంత్రి లోకేష్, రాష్ట్ర హోంమంత్రి అనిత ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావం, పునరావాస చర్యలు, నష్టపరిహారం అవసరాలపై సమగ్ర వివరాలు లోకేష్ అందించారు. తుపాను వల్ల మొత్తం రూ.6,352 కోట్ల నష్టం జరిగినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నివేదికలో పేర్కొంది. మొంథా తుపాను మొత్తం 3,109 ప్రభావిత గ్రామాల్లో ప్రభావం చూపించింది.. తుపాను తీరం దాటి సమయం: అక్టోబర్ 28 రాత్రి, కాకినాడ సమీపంలో గాలి వేగం గంటకు 100 కి.మీ వేగంతో ఉంది. అయితే, పునరావాస చర్యల్లో 1.92 లక్షల మందిని 2,471 శిబిరాలకు

మిగతా 2లో..

## హరీష్ రావు కంట్రోల్‌లో రాష్ట్ర బిజెపి

- కీలు బొమ్మల్లా రామచందర్ రావు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి



హైదరాబాద్,డిసెంబర్ 2 :హరీష్ రావు కంట్రోల్‌లో రాష్ట్ర బిజెపి నడుస్తోందని, తెలంగాణ రాజకీయాల్లో త్వరలో సంచలనం జరగబోతుందని టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామ

మిగతా 2లో..

## దేశంలో 811 మందికి ఒక వైద్యుడు

**- రాజ్యసభకు తెలిపిన నడ్డా**



న్యూఢిల్లీ,డిసెంబర్ 2 : దేశంలో వైద్యులు-జనాభానిష్పత్తి 1:811 అని కేంద్రం పార్లమెంటుకు మంగళ వారం తెలిపింది. సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్యమంత్రి రాజ్య సభలో సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. అల్లోపతి మరియు ఆయుష్ ( ఆయుర్వేదం, యోగా, ప్రకృతి వైద్యం,యునాని, సిద్ధ మరియు హోమియోపతి)ల్లో 80శాతం నమోదిత వైద్యులు అందుబాటులో ఉన్నారని ఊహిస్తే, దేశంలో వైద్యులు-జనాభా నిష్పత్తి 1:811గా అంచనా వేయబడిందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశంలో 13,88,185 మంది నమోదిత అల్లోపతి వైద్యులు ఉన్నారని, ఆయుష్ వైద్య విధానంలో 7,51,768మంది రిజిస్టర్డ్ ప్రాక్టిషనర్లు ఉన్నారని కేంద్ర ఆరోగ్యమంత్రి

మిగతా 2లో..

## ప్రధాని కార్యాలయం సౌత్ బ్లాక్ పేరు మార్పు

- సేవాతీర్థ్ గా మారుస్తూ కేంద్రం ఉత్తర్వులు
- రాజ్‌భవన్‌ల పేర్లు లోక్‌భవన్‌లుగా మార్పు




న్యూఢిల్లీ,డిసెంబర్ 2 : తెలంగాణలోని రాజ్ భవన్ పేరు మారింది. రాజ్ భవన్ ను లోక్ భవన్ గా పేరు మార్చారు. అన్ని రాష్ట్రాల్లో రాజ్ భవన్‌లను లోక్ భవన్ లుగా మార్చాలని కేంద్రం

మిగతా 2లో..

## విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా

- ఆర్టీసీకి మరో వెయ్యి ఇవి బస్సులు
- అందుకు అనుగుణంగా ఛార్జింగ్ స్టేషన్లు
- విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గేలా ఎంవోయూలు
- గత ప్రభుత్వం తీరుతో 9వేల కోట్ల భారం
- విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన
- విద్యుత్ ఉత్పత్తి, పంపిణీపై సిఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి,డిసెంబర్ 2 :ఆర్టీసీకి మరో వెయ్యి ఈవీ బస్సులు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఏపీ ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సచివాలయంలో విద్యుదుత్పత్తి, పంపిణీలో వ్యయం తగ్గింపు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ట్రాన్స్‌మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఎంవోయూలు కుదుర్చుకోవాలి. ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఎంవోయూలు చేసుకోవాలి. రాష్ట్రంలో పీఎం కుసుమ్ సహా రూఫ్‌టాప్ ప్రాజెక్టులు వేగంగా అమలు చేయాలి. ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులు 60 రోజుల్లో కార్యాచరణ ప్రారంభించేలా చూడాలన్నారు. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది ప్రోత్సాహకాలు కొనసాగించాలి. థర్మల్ పవర్ స్టేషన్లలోని బూడిదను వివిధ అవసరాలకు వినియోగించాలి. ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

మిగతా 2లో..

## ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాది

నిలబడండి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడదాం. సర్పంచ్ ఎన్నికల్లో మంత్రులు, తుమ్మల, భట్టి, పొంగులేటితో కలిసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించే వారిని ఎన్నుకోండని సీఎం విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కు కంచుకోట అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మొత్తం కాంగ్రెస్ కు అండగా నిలబడిందన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడ్డవే పాల్వంచలోనేనని చెప్పారు. 60 ఏండ్లు ఉద్యమం నడవడానికి కారణం ఈ పాల్వంచనే అని చెప్పారు. కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ కోసం వేలాది ఎకరాలు భూమి ఇచ్చారని చెప్పారు. దేశంలో వ్యవసాయం అభివృద్ధికి కారణం కాంగ్రెస్ అన్నారు రేవంత్. నాగార్జున సాగర్,శ్రీశైలం, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నెహ్రూ కట్టినవేనని తెలిపారు. ఈ పదేళ్లలో ఖమ్మం జిల్లాలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. కృష్ణా,గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా తడవాలన్నారు. ఎడ్యుకేషన్ కు సంబంధించి ప్రతీ అవకాశాన్ని జిల్లాకు ఇస్తున్నామన్నారు. పదేండ్లు పాలించినోళ్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత తనదన్నారు. సర్కార్ ఏ సంక్షేమ పథకం మొదలు పెట్టినా..ఖమ్మం జిల్లా నుంచే ప్రారంభించామని.. సన్నబియ్యం,రేషన్ పంపిణీ ఈ జిల్లా నుంచే ప్రారంభించామన్నారు. మీ ఓటే ఆయుధంగా మారి ప్రజాపాలన అందిస్తుందన్నారు. మంచోడినే సర్పంచ్ గా ఎన్నుకోవాలని.. మందుకో..డబ్బుకో ఓటేస్తే ఊరు మునుగుతుందని సూచించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,ఎంపిలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా

ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల్లోనూ విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఈవీ బస్సులు వస్తాయి. రాష్ట్రంలో 5వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశంచేశారు. సమీక్షలో విద్యుత్ వ్యవస్థపై గత ప్రభుత్వ విధానాలు ప్రస్తావ-నకు వచ్చాయి. అసమర్థ నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని గత పాలకులు అస్తవ్యస్థం చేశారని సీఎం చంద్రబాబు విమర్శించారు. పీపీఏ రద్దుతో రూ. 9వేల కోట్ల భారాన్ని వైకాపా ప్రభుత్వం ప్రజలపై మోపిందన్నారు. విద్యుత్ వినియోగించ కుండానే ప్రజాధనాన్ని కంపెనీలకు చెల్లించిందని చెప్పారు. ప్రభుత్వ భవనాలపై విస్తృత స్థాయిలో సౌర విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. . ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల్లోనూ విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. గత అసమర్థ నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని అస్తవ్యస్థం చేశారు. పీపీఏ రద్దుతో రూ. 9వేల కోట్ల భారాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రజలపై మోపింది. విద్యుత్ వినియోగించకుండానే ప్రజా ధనాన్ని కంపెనీలకు చెల్లించిందని విమర్శించారు.

## ప్రధాని కార్యాలయం సౌత్ బ్లాక్ పేరు మార్పు

ఉత్తర్వులు జారీ చేయడంతో పేరును మార్చారు. ప్రధాన మంత్రి కార్యాలయం భవనం పేరును కేంద్రం ప్రభుత్వం మార్చింది. దశాబ్దాలుగా సౌత్ బ్లాక్ లో కొనసాగుతున్న ప్రధాన మంత్రి కార్యాలయాన్ని ఆధునీకరించి దాని పేరును సేవా తీర్థ్ గా మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గవర్నర్ల అధికారిక నివాసం రాజ్ భవన్ ను లోక్ భవన్ గా మార్చాలని కేంద్రం సూచించిన సంగతి తెలిసిందే.. ఈ మేరకు పశ్చిమబెంగాల్,తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళ, త్రిపుర, ఒడిశా రాజ్ భవన్ లను లోక్ భవన్ లుగా మార్చారు. ఇపుడు తెలంగాణ రాజ్ భవన్ పేరు మారింది.

## దేశంలో 811 మందికి ఒక వైద్యుడు

జె.పి.నడ్డా తెలిపారు.దేశంలో మెడికల్ కాలేజీలు, అండర్ గ్రాడ్యుయేట్ (యుజి), పిజి వైద్య సీట్లు గణనీయంగా పెరిగాయని అన్నారు. 2014 నుండి మెడికల్ కాలేజీల సంఖ్య 387 నుండి 818కి, యుజి సీట్లు 51,348 నుండి 1,28,875కి, పిజిసీట్లు 31,185 నుండి 82,059కి పెరిగాయని అన్నారు.

## పవన్ కల్యాణ్ 'దిష్టి' వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ ఫైర్

కారణమంటూ పవన్ కల్యాణ్ చేసినట్లుగా చెబుతున్న వ్యాఖ్యలపై పొన్నం తీవ్రంగా స్పందించారు. "మీ సముద్రం నుంచి వచ్చే తుపాను మా రాష్ట్రాన్ని ముంచేస్తున్నా మేమెవరినీ తప్పుబట్టలేదు. అది ప్రకృతి అని భావించాం. కానీ డిప్యూటీ సీఎం స్థాయిలో ఉండి ఇలాంటి మాటలు మాట్లాడతారా? కోనసీమపై మేమెందుకు దిష్టి పెడతాం?" అని ఆయన నిలదీశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అన్నదమ్ముల్లాంటివని, ఇలాంటి వ్యాఖ్యలు ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య అగాధాన్ని సృష్టిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తులో ఉన్న ప్రభుత్వ ప్రతినిధి ఇలా మాట్లాడటం బాధాకరమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ నాయకత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

## అమిత్ షాతో లోకేశ్ తదితరుల భేటీ

తరలించాం. తుఫాను అనంతరం ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున వెంటనే రూ. 3,000 చొప్పున తక్షణ ఆర్థిక సాయం పంపిణీ చేసింది. అదేవిధంగా, కూలిన చెట్ల తొలగింపు, విద్యుత్ పునరుద్ధరణ, తాగునీటి సరఫరా వంటి అత్యవసర చర్యలు చేపట్టినట్లు లోకేష్ వివరించారు. అత్యవసర అవసరాల నిమిత్తం రూ. 60 కోట్లు ప్రభుత్వ ఖజానా నుంచి విడుదల చేసినట్లు తెలిపారు. ఇదిలావుంటే దిల్లీలో ఏపీ మంత్రి లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. విమానాశ్రయాల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో అంతర్జాతీయంగా పేరున్న జీఎంఆర్ సంస్థకు చెందిన సీనియర్ అధికారులతో మంత్రి లోకేశ్ మంగళవారం భేటీ అయ్యారు. ఏపీలోని విశాఖపట్నం వద్ద దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఎడ్యుసిటీని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. విశాఖ ప్రాంతంలో ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధి ద్వారా విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల.. విద్య, శిక్షణకు హబ్‌గా మారుతుంది. ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యం కలిగిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తీసుకురానున్నారు. ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంతానికి గేమ్ ఛేంజర్‌గా మారడంతో పాటు ఏపీ ఏవియేషన్ క్లస్టర్ అభివృద్ధిని వేగవంతం చేయనుంది. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## హరీష్ రావు కంట్రోల్‌లో రాష్ట్ర బిజెపి

రామ్మోహన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు చేతిలోకి తెలంగాణ బీజేపీ రిమోట్ కంట్రోల్ వెళ్లిపోయిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు చేతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేఎల్పీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలు బొమ్మల్లా మారిపోయారని అన్నారు. ఇక నుంచి హరీష్ కార్యక్రమాలను కేటీఆర్ కంటే ఎక్కువగా ప్రచారం వచ్చే విధంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రణాళిక చేస్తోందని చెందారు. తెలంగాణ రాజకీయాల్లో ఇద్దరు కీలక నేతలు.. హరీష్ రావు, ఈటల రాజేందర్ వ్యూహంలో ఇప్పుడు బీజేపీ చిక్కిందని అన్నారు. ప్రస్తుతం సామ చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచింది. మరోసారి హరీష్ రావు బీజేపీ తీర్థం పుచ్చుకుంటారనే వార్తలకు ఆద్యం పోసినట్టయింది. హరీష్ రావు బీజేపీలో చేరుతారంటూ వస్తున్న వార్తలు కొత్తేమి కాదు. గతంలో కూడా హరీష్ గులాబీ గూటి నుంచి ఎగిరిపోయి కాషాయ జెండా కప్పుకుంటున్నారని అనేక వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై హరీష్ రావు పలుమార్లు స్పందించారు. ఆ వార్తలను ఖండించారు. తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని క్లారిటీ ఇచ్చారు. అయితే ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయబడ్డ ఎమ్మెల్సీ కవిత హరీష్ రావుపై సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. హరీష్ రావుతో జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్, కేటీఆర్ లకు కవిత సూచనలు చేశారు. కాగా కవిత కూడా హరీష్ రావు బీజేపీ నేతలతో టచ్ లో ఉన్నారని పరోక్షంగా హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. మరి త్వరలో తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిమాణాలు జరుగుతాయని సామ రామ్మోహన్ రెడ్డి చేసిన ట్వీట్ నిజమవుతుందా? లేదా? అనేది వేచి చూడాలి.


# నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు

అన్నారు.. నేషనల్ హెరాల్డ్ కేసు పేరుతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను వేధించడం మోదీ ప్రభుత్వ లక్ష్యపూర్వక చర్యే అని విమర్శించారు. ఓటు చోరీపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా విచ్చలవిడిగా కేసులు తెరపైకి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ విలువలను కాపాడే బాధ్యత అందరిదినని, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు మద్దతుగా నిలబడే తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి వీరు ఆర్థిక సహాయం అందించారన్నారు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవని.. ఈ నేపథ్యంలో ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ సిబ్బందిని మంచి ఆలోచనతో వీరు ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. పత్రికను తిరిగి నడిపించాలనే ఉద్దేశ్యంతో బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొంత మంది కాంగ్రెస్ పార్టీ నేతలను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నిర్ణయించి.. నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్దరించే ప్రక్రియను వారు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఆయన సోదాహరణంగా వివరించారు. డిసెంబర్ 7వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తామని చెప్పారు. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి ఎంత ఖర్చు అయినా నిధులు కేటాయిస్తామన్నారు. ఓయూను ప్రపంచస్థాయిలో నిలబెడతామని ఆయన ప్రకటించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు. 9వ తేదీన తెలంగాణ – 2047 పాలసీ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దిగ్గజ నేతల సలహాలు సైతం తీసుకున్నామని పేర్కొన్నారు. కోర్ అర్బన్‌ను క్యూర్ చేయాలని తాము నిర్ణయించామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తున్నామని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, పరిశ్రమల తరలింపు తదితర అంశాలు తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు. కొన్ని పరిశ్రమలు నడిచే పరిస్థితి లేక మూతపడ్డాయన్నారు. మరికొన్ని పరిశ్రమల ఊరు, నగరం నడిబొడ్డున ఉన్నాయని.. ఆయా పరిశ్రమల ను తరలిస్తే కొంత భూమి అందుబాటులోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకెళ్తున్నామన్నారు. గత పదేళ్లలో తెలంగాణకు ఒక్క ఎయిర్‌పోర్టు కూడా తేలేదంటూ బీఆర్ఎస్ పార్టీపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 4 ఎయిర్‌పోర్టులు తెచ్చామని గుర్తు చేశారు. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమం దిశగా తీసుకెళ్తున్నామని వివరించారు.

2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీ రాష్ట్రంగా చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. అందరి కృషితో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కోటి మంది మహిళలకు చీరలు అందించడమే తమ లక్ష్యమన్నారు. చీరలు అందలేదంటూ ఫిర్యాదులు వస్తే అందుకు డీసీసీలదే బాధ్యత అంటూ సీఎం హెచ్చరించారు. డిసెంబర్ నెలాఖరులోగా మహిళలందరికీ చీరలు అందించాలని డీసీసీలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక రాష్ట్ర పరిపాలన గురించి మాట్లాడుతూ.. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమ దిశగా ముందుకు తీసుకెళ్తున్నాం. కొత్త సర్పంచులు ఎన్నికయ్యే సందర్భంలో జిల్లా అధ్యక్ష పదవులు రావడం మీకు గొప్ప అవకాశం. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సులు వంటి సంక్షేమ పథకాలపై చర్చ పెట్టాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. కేసీఆర్ ఇచ్చిన చీరలు పనికిరావని ప్రజలు నిందించారు. కానీ, మనం నిజాయితీతో కోటి మందికి చీరలు ఇస్తున్నాం. ఏ ఆడబిడ్డ కూడా చీర దక్కకుండా ఉండకూడదని తెలిపారు. డిసెంబర్ నెలాఖరులోగా చీరలు అందజేయకపోతే అది జిల్లా కాంగ్రెస్ కమిటీల బాధ్యత అవుతుందని హెచ్చరించారు. అలాగే అభివృద్ధి ప్రణాళికలపై మాట్లాడుతూ.. నాచారం ప్రాంతంలోని పరిశ్రమలను పట్టణం వెలుపలకు మార్చాలని, ఇందుతో మధ్యతరగతి కుటుంబాలు భూములు కొనుగోలు చేయగలవని, పేదలకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అలాగే వరంగల్ ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపన డిసెంబర్‌లో జరుగుతుందని వెల్లడించారు. మరోవైపు రాష్ట్రానికి బుల్లెట్ ట్రైన్ ఎందుకు ఇవ్వడం లేదని మోదీని ప్రశ్నిస్తానని, ఇస్తే.. ప్రజలకి మంచిది, ఇవ్వకపోతే తెలంగాణ ప్రజల రియాక్షన్ బీజేపీ చూస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై మాట్లాడుతూ.. రాజకీయాల్లో కాళ్లకు కట్టెలు పెట్టడం సహజం. కానీ అక్కడే ఆగిపోవద్దు, ముందుకు సాగాలని కార్యకర్తలకు హితబోధ చేశారు.తాను సీఎం అయ్యేముందు కొంతమంది పై కోపం ఉన్నా, ఇప్పుడు పనిపై దృష్టి పెట్టి సైలెంట్‌గా ముందుకు సాగుతున్నానని చెప్పారు. కాంగ్రెస్‌లో విభిన్న మనస్తత్వాలు ఉన్నప్పటికీ, మంచి అభిప్రాయం, మంచి ఉద్దేశాలు మాత్రం ఏకంగా ఉండాలని సూచించారు. ఇక చివరలో.. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనదే. నేను సీఎం కావచ్చు, కానీ ఆ పదవులు పొందడం నిజమైన కష్టమే. ఆ విలువ మీకు తెలుసు. అందరం కలిసే పని చేసినప్పుడే కాంగ్రెస్ బలపడుతుందని అన్నారు. టిపిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ కోచ్‌లలోనూ దిండ్లు..బెడ్ షీట్లు

**- చైన్నై రైల్వే డివిజన్‌లో జనవరి నుంచి అమలు**



చెన్నై,డిసెంబర్ 2 : రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్.. రైల్వే ప్రయాణికుల కోసం కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చింది రైల్వే శాఖ. ఇప్పటివరకు ఏసీ కోచ్ లలో మాత్రమే అందుబాటులో ఉన్న బెడ్ షీట్లు, పిల్లోస్ సౌకర్యం.. ఇప్పుడు నాన్ ఏసీ స్లీపర్ కోచ్ లలో కూడా అందుబాటులోకి రానుంది. తొలిసారి దక్షిణ రైల్వే పరిధిలోని చైన్నై రైల్వే డివిజన్ బెడ్ షీట్లు, పిల్లోస్ ను అందిస్తోంది. ఈ సౌకర్యాన్ని ఆన్ డిమాండ్ ఆన్ పేమెంట్ మోడ్ లలో పొందవచ్చు. ప్రయాణికులకు మెరుగైన సేవలందిచే క్రమంలో దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ నాన్ ఏసీ కోచ్ లలో స్లీపర్ క్లాస్ ప్రయాణికులకు జనవరి 1 నుంచి దిండ్లు, బెడ్ షీట్లు అందించనున్నట్లు ప్రకటించింది. ఎంపిక చేసిన పది రైళ్లలో మూడేళ్ల పాటు ఈ కొత్త సౌకర్యాలను అమలు చేస్తారు. గతంలో ఎసి కోచ్ లలో మాత్రమే ఈ సౌకర్యం ఉండేది. వర్షాకాలం, శీతాకాలంలో రిలాక్స్ , పరిశుభ్రమైన ప్రయాణాన్ని ప్రయాణికులకు అందించడమే లక్ష్యంగా రైల్వే శాఖ పనిచేస్తోంది. దీంతో ప్రయాణీకులకు సుదూర ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉండనుంది. దుప్పట్లు, దిండ్ల నిర్వహణ పంపిణీని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. సేకరణ, యాంత్రిక వాషింగ్, ప్యాకింగ్, లోడింగ్, పంపిణీ ,నిల్వ – సేవా వ్యవధి అంతటా పరిశుభ్రత,సరఫరా చేయాల్సి ఉంటుంది. సుమారు రూ. 28.27 లక్షల వార్షిక లైసెన్స్ ఫీజులో ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తారు. దిండుతో కూడిన కవర్ ను రూ. 30 కి, బెడ్ షీట్ కు రూ. 20కి రెంట్ చెల్లించి తీసుకోవచ్చు. రెండూ కావాలంటే రూ. 50 లకు చెల్లించాల్సి ఉంటుంది. జనవరి 1 నుంచి మొత్తం పది రైళ్లలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. రాబోయే రోజుల్లో దేశ వ్యాప్తంగా అన్ని జోన్లలో ఈ సౌకర్యాన్ని అమలు చేసే అవకాశం ఉంది.

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

హైదరాబాద్,డిసెంబర్ 2 :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో సాంకేతికత వినియోగాన్ని పెంచే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, వేగం పెంచే లక్ష్యంతో పలు విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్షను తప్పనిసరి చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ నెం. 237ను జారీ చేసింది. ఈ కొత్త నిబంధన ప్రకారం ఉద్యోగులు కంప్యూటర్ పరీక్షలో కచ్చితంగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ జీఓ ప్రకారం నిర్దేశిత కేటగిరీల ఉద్యోగులు కంప్యూటర్ పరీక్ష పాస్ కావడంతో పాటు ఆఫీస్ ఆటోమేషన్ యంత్రాల వినియోగంలో కూడా నైపుణ్యం ప్రదర్శించాలి. జూనియర్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ కమ్ టైపిస్టులు, సీనియర్, జూనియర్ స్టెనోగ్రాఫర్లు, యూడీ, ఎల్డీ టైపిస్టులు వంటి క్లరికల్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందికి ఈ నిబంధన వర్తిస్తుంది. ప్రభుత్వ దైనందిన కార్యకలాపాల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశం. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరిన వారిలో కొందరికి కంప్యూటర్ పరిజ్ఞానం తక్కువగా ఉండవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పరీక్ష ద్వారా ఉద్యోగులందరూ తమ సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సి ఉంటుంది. ఫైళ్ల నిర్వహణ, డేటా ఎంట్రీ, కమ్యూనికేషన్ వంటి పనులు వేగవంతం కావడానికి ఇది దోహదపడుతుంది. పరీక్షలో ఉత్తీర్ణత సాధించని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. డిజిటల్ పాలనను పటిష్ఠం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## త్వరితగతిన గ్లోబల్ సమ్మిట్ వేదిక పనులు

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే డెలిగేట్స్, అతిథులు ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమ్మిట్ వేదిక వద్ద నుంచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు ఇతర విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. డిసెంబర్ 5వ తేదీ లోపు పనులన్నీ పూర్తి చేసి.. 6వ తేదీన డ్రై రన్ కండక్ట్ చేయాలని ఉన్నతాధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి భారీగా ప్రతినిధులు హైదరాబాద్ తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. అలాగే భద్రతను సైతం కట్టుదిట్టం చేస్తుంది. అందుకోసం డీజీపీ శివధర్ రెడ్డి పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.

## ఐఏఎస్ అధికారి కూతురు బలవన్మరణం

**- ప్రేమించి పెళ్లి చేసుకుని కట్నవేధింపులకు బలి**

గుంటూరు,డిసెంబర్ 2 : పెళ్ళైన కొద్ది నెలలకే ఓ ఐఏఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నివాసం ఉంటున్న సీనియర్ ఐఏఎస్ చిన్నరాముడు కుమార్తె మాధురి సాహితీబాయి(27) ఆదివారం రాత్రి తన గదిలోని బాత్‌రూమ్‌లో ఉరివేసుకుంది. నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం బుగ్గనపల్లి తండాకు చెందిన రాజేష్‌నాయుడిని 2025 మార్చిలో ఆమె ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. వివాహమైన మూడో నెల నుంచి భర్త తనను వేధిస్తున్నాడంటూ తల్లిదండ్రులకు ఆమె తెలియజేయగా, కుమార్తెను అక్కడి పోలీసుల సహకారంతో రెండు నెలల కిందట తాడేపల్లిలోని నివాసానికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఆమె పుట్టింటిలోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆదివారం బలవన్మరణానికి పాల్పడింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. తల్లి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నరాముడు మీడియాతో మాట్లాడుతూ.. 'ఉద్యోగం ఉందని మోసం చేసి మా కుమార్తెను రాజేష్‌నాయుడు మహానందిలో రిజిస్టర్ మ్యారేజీ చేసుకున్నాడు. పెద్దల సమక్షంలో మళ్లీ పెళ్లి చేస్తామని చెప్పి



అతడితో మా కుమార్తెను పంపాం. ఈ క్రమంలో ఆమెను అదనపు కట్నం తెమ్మంటూ రాజేష్ వేధింపులకు గురి చేశాడు. నీకు తానే దిక్కు, చంపేస్తానని బెదిరించేవాడు. కనీసం మాకు ఫోన్ చేయాలన్నా భర్త అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడ ఉండలేనని కుమార్తె చెప్పడంతో రెండు నెలల కిందట ఇంటికి తీసుకొచ్చాం. వచ్చిన నాటి నుంచి తన భర్తది నిజమైన ప్రేమ కాదని, అందుకే తీసుకెళ్లేందుకు రావడం లేదని కుమార్తె బాధపడుతూ ఉండేది. మాకు ఇలా దూరమవుతుందని అనుకోలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## జైళులో ఇమ్రాన్ ఖాన్ క్షేమం

**ప్రభుత్వ అనుమతితో జైలును సందర్శించిన సోదరి**



లాహోర్,డిసెంబర్ 2 : పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతిచెందారంటూ వచ్చిన వదంతులకు ఎట్టకేలకు తెరపడింది. ఆయన జైల్లో సురక్షితంగానే ఉన్నారని సోదరి ఉజ్మా ఖానుమ్ తెలిపారు. అయితే, మానసికంగా వేధిస్తున్నట్లు ఆరోపించారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించా లంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగిన విషయం తెలిసిందే. దీంతో ఉజ్మాతో పాటు ఓ లాయర్ ఆయన్ని కలిసేందుకు జైలు అధికారులు మంగళవారం అనుమతించారు. కొన్నిరోజులుగా ఇమ్రాన్ మరణించారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వదంతులు వ్యాపించిన విషయం తెలిసిందే. వీటన్నింటినీ అక్కడి ప్రభుత్వం ఖండించింది. అయినప్పటికీ.. ఆయన్ని చూపించాలని, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు వెల్లడించాలని మద్దతుదారులు డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించాలని కుటుంబ సభ్యులు కోరారు. అందుకు జైలు అధికారులు మంగళవారం వరకూ నిరాకరిస్తూ వచ్చారు. దీంతో ఇమ్రాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఇమ్రాన్‌ను కలిసేందుకు అధికారులు అనుమతించారు.

## ఓటర్ల జాబితా సవరణపై చర్చకు అంగీకారం

**- 8న వందేమాతరం..9న ఎన్నికల సంస్కరణలపై చర్చ**

**- స్పీకర్ సమక్షంలో అఖిలపక్ష భేటీలో విపక్షాల అంగీకారం**

న్యూఢిల్లీ,డిసెంబర్ 2 : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై చర్చకు కేంద్రం అంగీకరించింది. అయితే ప్రత్యేకంగా 'సర్'పై కాకుండా ఎన్నికల సంస్కరణలు అనే విస్తృత అంశాన్ని సభ ముందు ఉంచనుంది. ఈ మేరకు స్పీకర్ ఓం బిర్లా మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో కేంద్రం, విపక్షాల మధ్య అవగాహన కుదిరింది. ఆ ప్రకారం డిసెంబర్ 8న వందేమాతరం పై, 9న ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ జరుగనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. 'లోక్‌సభ స్పీకర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నందున దానిపై డిసెంబర్ 8 తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి చర్చ జరపాలని సమావేశం నిర్ణయించింది. అలాగే డిసెంబర్ 9 తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఎన్నికల సంస్కరణలపై చర్చ మొదలవుతుంది' అని కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. కాగా, అఖిలపక్ష సమావేశానంతరం మీడియాతో కాంగ్రెస్ విప్ కె.సురేష్ మాట్లాడుతూ, ఎస్ఆర్ఐ అంశంపై చర్చించాలని విపక్షాలు కోరాయని, ఎస్ఐఆర్‌ను కూడా జతచేసి ఎన్నికల సంస్కరణలపై విస్తృత చర్చకు సమావేశం నిర్ణయించిందని తెలిపారు. సభలో 10 గంటల చొప్పున రెండు డిబేట్లకు సమయం కేటాయించారని, అవసరమైతే సమయం మరింత పొడిగించే అవకాశం ఉంటుందని చెప్పారు.



# సంపాదకీయం

## పార్లమెంటులో విపక్షం రచ్చ రాజకీయం !

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఊహించినట్లుగానే వాయిదాలతో మొదలయ్యాయి గతానికి భిన్నాంగా సమావేశాలు ప్రారంభం కాలేదు. గతంలోనూ ఇలాగే వాయిదాల మీద వాయిదాలు పడుతూ.. మధ్యమధ్యలో ప్రభుత్వం తనకు కావాల్సిన ఎజెండాను పూర్తి కానిచ్చుకుని, నిరవధికంగా వాయిదా వేస్తూ వస్తోంది. ఇదే తంతు గత కొన్నేళ్లుగా చూస్తున్నాం. గొడవ చేయడం, తాము పట్టిన అంశంపైనే చర్చించాలని విపక్షం పట్టుబట్టడం..ప్రభుత్వం ససేమిరా అనడం..వాయిదా పడడం కూడా గత సమావేశాల్లో చూశాం. ఇప్పుడు కూడా అందుకు భిన్నంగా ఏమీ జరగడం లేదు. విపక్షాలు ఇదే పెద్ద విజయంగా భావిస్తున్నాయి. కోరుకున్న అంశంపై ఎలా చర్చించాలో తెలియని వారంతా పార్లమెంటులో ఎంపిలుగా ఉన్నారు. ఏ రూల్ కింద కోరితే చర్చకు వస్తుందో అందరికీ తెలుసు. కానీ రూల్ బ్రేక్ చేసి, పట్టుబట్టి చర్చించాలని కోరుకోవడం దుర్మార్గం. పార్లమెంటులో ప్రజల సమస్యలపై చర్చించడం ద్వారా ప్రతిపక్షం ప్రధాన బాధ్యతను తీసుకోవాలి. కానీ గత దశాబ్దకాలంగా అలాంటి సంప్రదాయం తుంగలో తొక్కారు. గొడవ చేయడం విపక్షం వంతయితే..వాయిదా వేయడం ప్రభుత్వం విధానంగా మారింది. ఈ క్రమంలో సోమవారం ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తొలిరోజే వాయిదాతో మొదలయ్యాయి. పార్లమెంటు కార్యకలాపాలను శాంతియుతంగా ముందుకు తీసుకెళ్లకుండా మొండిగా వ్యవహరించడంలో ఇరుపక్షాలు తమవంతు పాత్రను సమర్థంగా నిర్వహించాయి. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియపై అత్యవసర చర్చ జరపాలని, ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం, దానిని తిరస్కరించడం ద్వారా విలువైన పార్లమెంట్ సమయం తొలిరోజు, మలిరోజు ఢిల్లీ కాలుష్యంలో కలిసి పోయాయి. సర్ ద్వారా నకిలీ, చనిపోయిన వారి ఓట్లను తొలగిస్తే విపక్షాలకు అభ్యంతరం ఎందుకన్నది మొదట చర్చించాలి. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారు ఇక్కడ ఓటు ఎలా పొందారన్నది రెండో ప్రశ్న. ఈ రెండింటికీ విపక్షాల వద్ద సమాధానం లేదు. ఒక రాజ్యాంగా సంస్థ ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియను అడ్డుకోవడం రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమే అవుతుంది. రాజ్యాంగ బుక్‌ను పట్టుకుని ఊరేగుతున్న రాహుల్, ఆయన అనుచరగణానికి ఇది కూడా తెలియకపోవడం మూర్ఖత్వంగానే చూడాలి. రాజ్యాంగ ప్రసాదించిన హక్కుల గురించి మాట్లాడుతున్న రాహుల్ పరివారం దీనిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలి. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘాన్ని తక్కువ చేసి మాట్లాడడం, వారు చేసే ప్రక్రియలను అడ్డుకోవడం రాజ్యాంగ రక్షణ అవుతుందా అన్నది రాహుల్ చెప్పాలి. ఓట్ల తొలగింపు ప్రక్రియలో ఎవరి ఓటయినా గల్లంతయితే నిలదీయా లి. ఇప్పటికే సుప్రీం గడప దొక్కిన రాహుల్ ఒక్క ఓటుపైనా అఫిడవిట్ దాఖలు చేసి ఆధారాలు చూపలేక పోయారు. బీహార్‌లో ఓటమి అన్నది రాహుల్ స్వయంకృతం తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా తెలిసి చేస్తున్నవే తప్ప మరోటి కాదు. ఇందులో ప్రజలపై వారికి ఎలాంటి ప్రేమా లేదు. కేవలం అధికార దాహంతో చేస్తున్నవే. అలా కానట్లయితే పార్టమెంటులో చర్చకు నోటీస్ ఇచ్చి, తగిన సమయంలో చర్చించవచ్చు. కానీ అలా చేయడం లేదంటే..రచ్చ చేయడం వారి లక్ష్యంగా కనిపిస్తోంది. ఇటీవల చనిపోయిన వారి ఆధార్ నంబర్లు దాదాపు 2కోట్లను ఉడాయ్ రద్దు చేసింది. అంటే అది తప్పుచేసినట్లుగా భావించాలా? చనిపోయిన వారి ఓట్లు, ఊరుమారిన వారి ఓట్లు, అక్రమంగా దేశంలో ఓటర్లుగా నమోదైన విదేశీయుల ఓట్లను అలాగే ఉంచుమంటారా అన్నది రాహుల చెప్పాలి. నిజానికి అధికారంలోకి రావడమే లక్ష్యంగా రాహుల్ చేస్తున్న యాగీలో భాగమే ఈ ఓటు రచ్చ. ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను పక్కన పెట్టి తొలిరోజే పార్లమెంటరీ సాంప్రదాయాలను ప్రతిపక్షాలు తుంగలో తొక్కాయి. ఫలితంగా లోక్‌సభ వరుసగా రెండ్రోజులు పూర్తిగా స్తంభించిపోయింది. రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఇది ఇలాగే కొనసాగుతుంది తప్ప కొత్తగా వీరినుంచి ఆశించడానికి ఏమీ ఉండదు. ఎందుకంటే.. ఎస్ఐఆర్‌పై పార్లమెంటు దద్దరిల్లింది. ప్రతిపక్షాల ఆందోళనతో లోక్‌సభలో వాయిదాల పర్వం నడిచింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసాం..అని చెప్పుకోవడానికి తప్ప మరోటి కాదు. అందుకే తొలిరోజే.. ఎస్ఐఆర్‌పై చర్చించాలని పట్టుపడుతూ ప్రతిపక్ష సభ్యులు సభా వేదిక వద్దకు దూసుకెళ్లారు. ఇలా వారు అధికారంలో ఉన్నప్పుడు బిజెపి కూడా చేసిన తతంగమే. ఇది కూడా తమ పోరాటంగా వారు భావిస్తున్నారు. పార్లమెంటు ను స్తంభింప చేయడం అన్నది ఓ విజయంగా భావిస్తున్నారు. సర్‌పై ఎలాగూ ప్రభుత్వం వెంటనే చర్చకు అనుమతించదు. ఎందుకంటే వాయిదా తీర్మానం అన్నది కొంపలు మునిగే సమయంలో మాత్రమే అనుమతిస్తారు. అందుకే విపక్షాలు ఇచ్చిన తీరర్మానాన్ని స్పీకర్ ఓంబిర్లా తిరస్కరించడంతో వేదిక వద్దనే ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎస్ఐఆర్ ను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దంటూ నినదించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ అన్ని అంశాలపై చర్చకు సిద్ధమే నని స్పష్టం చేశారు. ప్రజలు మిమ్మల్ని పార్లమెంట్‌కు పంపింది. నినాదాలు, ఆందోళనలు చేయడానికి కాదని స్పష్టం చేశారు.. ఇలా రెండోరోజూ ఇదే సీన్ రిపీట్ అయ్యింది. గతంలో ఆదానీ విసయంలో కూడా ఇలాగే చేశారు. పార్లమెంట్‌ను స్తంభింప చేయడం విజయమనుకుంటే ప్రజలకు జవాబు చెప్పాలి. పార్లమెంట్ అన్నది ప్రజల సొత్తు. కవలం 20,30 మంది ఎంపిలది కాదని గుర్తించాలి. ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ అంశంపై అత్యవసర చర్చకు డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల డిమాండ్‌ను పరిశీలిస్తున్నామని, అత్యవసర చర్చ సాధ్యం కాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. అయినా ఆందోళన చేస్తున్నారంటే రాజకీయం తప్ప మరోటి కాదు. ఇలాంటి విపక్షాల వల్లనే పార్లమెంటులో ఏ సమస్యా చర్చకు రావడం లేదు. ప్రభుత్వం కూడా ఇదే కోరుకుంటోంది. చర్చలు జరిగితే వారి వ్యవహారం కూడా బయట పడుతుంది. అయితే చర్చల కోసం సక్రమమైన పద్ధతిలో విపక్షాలు వ్యూహాత్మకంగా వ్యవహరించనంత కాలం రచ్చ సాగుతూనే ఉంటుంది.


## ట్రైన్ ఢీకొని కలికిరి కొండకు చెందిన 13 ఆవులు మృతి





పూతలపట్టు, డిశంబర్ 02 ( విజన్ ఆంధ్ర ): చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజకవర్గం, పూతలపట్టు మండలం, అమ్మేపల్లి సమీపంలో మంగళవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో ట్రైన్ ఢీకొని 13 ఆవులు మృతి చెందాయి. స్థానికుల కథనం మేరకు తిరుపతి వైపు నుండి చిత్తూరు వైపు వస్తున్న ట్రైన్ కలికిరి కొండ దేవస్థానానికి చెందిన 10 ఆవులను అమ్మేపల్లి సమీపంలో ఢీకొంది. మరో మూడు ఆవులు సామనత్వం వద్ద ఢీకొండంతో మొత్తం 13 ఆవులు మృతి చెందాయి. స్థానికంగా ఉన్న కొంతమంది ప్రజలు ఎగబడి ఆవు మాంసం కట్ చేసుకుని తీసుకెళ్లారు. సంఘట స్థలానికి చేరుకున్న పోలీసులు, విచారణ చేపట్టిన అధికారులు.


## చిత్తూరు నగరంలో రోడ్డు అభివృద్ధి పనులు వేగవంతం



చిత్తూరు, డిశంబర్ 02 ( విజన్ ఆంధ్ర ) : నగరంలో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పర్యవేక్షణలో, స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మార్గదర్శకత్వంలో నగరపాలక కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు పురపాలక శాఖ వేగవంతం చేసింది. దర్గా సర్కిల్ నుండి ఇరువారం వరకు రోడ్డు విస్తరణలో భాగంగా, మంగళవారం నాడు పలమనేరు రోడ్డుపై ఉన్న వివిధ రకాల ఆక్రమాలను తొలగించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో అనధికార నిర్మాణాలను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు విస్తరణ పనులను ఎటువంటి అంతరాయం లేకుండా పూర్తిచేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## నేటి టీయూడబ్ల్యూజే 'మహా ధర్నాకు' మద్దతు

### -తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కదిరి వెంకట రమణారావు



హైదరాబాద్, డిసెంబర్ 02 (విజన్ ఆంధ్ర) : జర్నలిస్టు సమస్యలపై తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో డిసెంబర్ 3న రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్(టిజేఏ) సంపూర్ణ మద్దతు తెలుపుతుందని టిజేఏ రాష్ట్ర అధ్యక్షుడు కదిరి వెంకట రమణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు, తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ సలహాదారు ఉప్పల లక్ష్మణ్ సూచన మేరకు ఈ మహాధర్నాలో టిజేఏ కూడా పాల్గొంటుందని టిజేఏ రాష్ట్ర కార్యదర్శి ఘోరీ, ఎన్.యూ.జే.ఐ ఉపాధ్యక్షుడు రాజేంద్రనాథ్ లు తెలిపారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అక్రిడేషన్, హెల్త్ కార్డ్స్, ఇన్సూరెన్స్, బస్ పాసులు, ట్రైన్ పాసులు, ఇండ్ల స్థలాలు, ఇండ్లు తదితర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎస్సీ రిజర్వేషన్స్ 20% పెంచాలి :డాక్టర్ పిడమర్తి రవి



తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీల రిజర్వేషన్లు 20 శాతానికి పెంచాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ రవి అన్నారు ఈరోజు దిల్ కుష్ గెస్ట్ హౌస్ లో జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ గారిని కలిసి వినతి పత్రం అందజేసిన ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు డాక్టర్ విడమర్తి రవి మరియు విద్యార్థి సంఘాల నాయకులు. హర్యానా25 శాతం రిజర్వేషన్స్, పంజాబ్ లో 21 శాతం, కర్ణాటక లో 17 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని ఆ రాష్ట్రాలలో SC లా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉన్నాయని అదే విధంగా తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు 19 శాతం ఇచ్చారని పెరిగిన జనాభాకు అనుగుణంగా 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు బుదాల బాబురావు ,BSF రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, బొమ్మెర స్టాలిన్, మాదుగుల శివ, దేవరకొండ నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

## శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో రాతి నిర్మాణాలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలి

### రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.




ములుగు డిసెంబర్ 02 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): మంగళవారం: ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కెకాన్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదివాసి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న రాతి నిర్మాణాలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని , రహదారి విస్తరణ పనులలో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్యూ లైన్స్ రెలింగ్ పనులను మేడారం స్తూపం వద్ద సర్కిల్ సుందరీకరణ పనులను, పరిశీలించి జాతర సమీపిస్తున్న తరుణంలో ముందస్తు వనదేవతల సందర్శనార్థం మొక్కులు చెల్లించడానికి వచ్చే భక్తులకు ఆటంకం కలగకుండా చూడాలని మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్దేశించిన గడువులోపు అభివృద్ధి పనులను పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో , ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు

## చైనా మాంజా విక్రయంపై జిల్లాలో ప్రత్యేక తనిఖీలు

### కఠిన సూచనలు జారీ చేసిన జిల్లా పోలీసులు



నిర్మల్ డిసెంబర్ 2(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి ): జిల్లాలో చైనా మాంజా విక్రయాన్ని నిరోధించేందుకు జిల్లా పోలీస్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పతంగులు ఎగరేసే సీజన్ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే చైనా మాంజ వినియోగం, రవాణా, నిల్వ మరియు విక్రయాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు నిర్మల్ పట్టణంలోని కిరాణా దుకాణాలు, చిన్నపాటి వ్యాపార కేంద్రాలను సందర్శించి అక్కడ చైనా మాంజా నిల్వ లేదా విక్రయం జరుగుతోందా అని పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులకు చైనా మాంజా విక్రయం చట్టపరంగా నిషేధించబడిందని, దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టంగా తెలియజేశారు.పర్యావరణానికి హానికరంగా ఉండే ఈ మాంజా ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేసే ఘటనలు అనేక ప్రాంతాల్లో నమోదవుతున్న నేపథ్యంలో, నిర్మల్ జిల్లా పోలీస్ తమ పరిధిలో ఈ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు సంకల్పబద్ధంగా చర్యలు చేపడుతోంది.పోలీసులు ప్రజలను కూడా అప్రమత్తం చేస్తూ చైనా మాంజా అమ్మకం, కొనుగోలు, ఉపయోగం వంటి వాటిని ఎక్కడ గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. పతంగులు ఎగరేసేటప్పుడు సురక్షిత మాంజానే ఉపయోగించాలి, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీస్ అధికారులు సూచించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పట్టణ ఎస్ఐ సంజీవ్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చేతుల మీదుగా నియామకం పత్రం అందుకున్న వజ్రేష్ యాదవ్



బోడుప్పల్, డిసెంబర్ 02(విజన్ ఆంధ్ర): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్ కు మంగళవారం నియామకం పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ లు మాట్లాడుతూ రాబోయే గ్రేటర్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా ఇప్పటి నుండే పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయేలా కార్యకర్తలను సమాయత్తం చేయాలని తెలిపారు. అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పార్టీని జిల్లాలో బలమైన శక్తిగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖార్గే,పార్లమెంటరి నాయకుడు రాహుల్ గాంధీ,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జిల్లా ఇంచార్జ మంత్రి శ్రీధర్ బాబులకు ధన్యవాదాలు తెలిపారు.

## మిషన్ భగీరథ పంప్ హౌస్ ప్రహరీ గోడ పనులు పరిశీలన



కోరుట్ల ఆర్సీ, డిసెంబర్ 02 ( విజన్ ఆంధ్ర ) : జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని మిషన్ భగీరథ పంప్ హౌస్ ప్రహరీ గోడ నిర్మాణ పనులను మంగళవారం అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.మోహన్, ఏఈ దీపక్, శానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, వర్క్ ఇన్స్పెక్టర్ శేఖర్, సృజన్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాప్‌లోని మద్యం సీజ్ చేసిన రేగోడ్ ఎస్సై పోచయ్య



అందోల్ /మెదక్ డిసెంబర్ 02(విజన్ ఆంధ్ర ):మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సూచనల మేరకు ఎన్నికల కోడ్ ఉన్నందున రేగోడు మండల పరిధిలోని మక్కా వెంకటాపూర్ గ్రామంలో వీరభద్ర హోటల్లో తనిఖీ చేయగా 6.60 లీటర్ల మద్యం లభించింది. మద్యం విలువ రూపాయలు 3750/- అని తెలిపారు.బెల్ట్ షాప్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఎస్సై పోచయ్య మాట్లాడుతూ మండలంలో మద్యం నిల్వ ఉంచిన సరఫరా చేస్తే తగుచర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.సర్పంచ్ ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతి ఒక్కరు నగదు 50,000/-వేల రూపాయలకు మించి ఎవరు వెంట తీసుకు వెళ్ళకూడదు మండల ప్రజలకు తెలిపారు.

## చిగుళ్ల వ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ప్రమాదం

### -పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా



హైదరాబాద్, డిసెంబర్ 02 (విజన్ ఆంధ్ర) : చిగుళ్ల వ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ప్రమాదం అని పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా(ఎం.డి.ఎస్, పిహెచ్ డి) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ చిగుళ్ల వ్యాధి వల్ల దంతాల నష్టం, మధుమేహం, గుండె జబ్బులు, గర్భధారణలో సమస్యలు వంటి సాధారణ నోటి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని అన్నారు. నివారణ, చికిత్స కోసం ముందస్తుగా గుర్తించడం ద్వారా దీర్ఘకాలిక సమస్యల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని అన్నారు. ఆరోగ్యకరమైన చిగుళ్ళు బలమైన దంతాలకు పునాదని అన్నారు. లవంగం, వేప వంటి సహజ పదార్థాలతో సమృద్ధిగా ఉన్న డాబర్ రెడ్ పేస్ట్ బ్యాక్టీరియాతో పోరాడుతుందని తెలిపారు. నోటి పరిశుభ్రతతో చిగుళ్లను మంచి స్థితిలో ఉంచడానికి ఇండియన్ డెంటల్ అసోసియేషన్ గుర్తింపు పొందిన డాబర్ రెడ్ టూత్ పేస్ట్ సహాయ పడుతుందని తెలిపారు.

## బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గా బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాస్



మల్కాజ్గిరి డిసెంబర్ 2 (విజన్ ఆంధ్ర ): జాతీయ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ బీసీ జేఏసీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా తాటికొండ శ్రీనివాస్ ఆచారి నియమితులయ్యారు.ఈ మేరకు కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ ఆచారి మంగళవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ కుల సభ్యులు వివిధ రంగాలలో పురోగతి సాధించే విధంగా కృషి చేస్తానని అన్నారు.

## బాచుపల్లిలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం..



హైదరాబాద్: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో విషాదం చోటుచేసుకున్నది. ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌కు చెందిన వర్షిత (16) బాచుపల్లిలోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. తానుంటున్న హాస్టల్ గదిలో వర్షిత ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన హాస్టల్ నిర్వాహకులు పోలీసు లకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

# రాజ్యాంగంలో ప్రాధమిక హక్కులు

హైదరాబాద్ బ్యూరో చీఫ్, డిసెంబర్ 2 (విజన్ ఆంధ్ర ) సమానత్వపు హక్కు సమానత్వపు హక్కు, రాజ్యాంగం అధికరణాలు 14, 15, 16, 17, 18ల ప్రకారం ప్రసాదించబడింది. ఈ హక్కు చాలా ప్రధానమైనది. స్వేచ్ఛా సమానత్వాలు ప్రసాదించే ఈ హక్కు, క్రింది విషయాల గ్యారంటీనిస్తుంది.

చట్టం ముందు సమానత్వం. రాజ్యాంగ అధికరణ(ఆర్టికల్) 14 ప్రకారం, భారత భూభా గంలో ఉన్న వ్యక్తులందరూ సమానంగా, భారత చట్టాల ప్రకారం కాపాడాలి. అనగా ప్రభుత్వం వ్యక్తుల పట్ల కుల, మత, వర్గ, వర్ణ, లింగ, పుట్టిన ప్రదేశాల ఆధారంగా ఎలాంటి వివక్ష చూపరాదు.

పౌరప్రదేశాలలో సామాజిక సమానత్వం, సమాన ప్రవేశాలు: అధికరణ 15 ప్రకారం, పౌరులు పౌర(పబ్లిక్) ప్రదేశాలైన పార్కులు, మ్యూజియంలు, బావులు, స్నానఘాట్లు, దేవాల యాలు మొదలైన చోట్ల ప్రవేశించుటకు సమాన హక్కులు కలిగి ఉన్నారు. ప్రభుత్వాలు పౌరుల పట్ల ఎలాంటి వివక్ష చూపరాదు. కానీ కొన్ని సందర్భాలలో ప్రభుత్వం, స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేక వసతులు కల్పించవచ్చు. సామాజికంగా వెనుకబడిన వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చు.

పౌర ఉద్యోగాల విషయాలలో సమానత్వం : అధికరణ 16 ప్రకారం, ఉద్యోగాలు పొందేందుకు, ప్రభుత్వా పౌరులందరికీ సమాన అవకాశాలు, హక్కులు కల్పించాలి. ప్రభుత్వాలు, పౌరులకు ఎలాంటి వివక్షలు చూపరాదు. 2003 'పౌర (సవరణ) బిల్లు' ప్రకారం, ఈ హక్కు, ఇతర దేశాల పౌరసత్వాలు పొందిన భారతీయులకు వర్తించదు.


అంటరానితనం నిషేధాలు : అధికరణ 17 ప్రకారం, అంటరానితనాన్ని ఎవరైనా అవలం బిస్తూ వుంటే చట్ట ప్రకారం శిక్షార్హులు. అంటరానితనం నేర చట్టం(1955), 1976లో పౌరహక్కుల పరిరక్షణ చట్టం పేరు మార్పు పొందింది.

బిరుదుల నిషేధాలు : అధికరణ 18 ప్రకారం, భారతపౌరులు ఎలాంటి బిరుదు లూ పొందరాదు. ఇతర దేశాల నుంచి ఎలాంటి బిరుదులు పొందరాదు.

ఉదాహరణకు బ్రిటిష్ ప్రభుత్వం, రాయ్ బహు దూర్, ఖాన్ బహదూర్ వంటి "ప్రభుత్వ లేక రాజ్య సంబం ధ బిరుదులు", సైన్యపరమైన బిరుదులూ ప్రకటించేది. ఇలాంటివి నిషేధం. కానీ విద్య, సంస్కృతి, కళలు, శాస్త్రాలు మొదలైన వాటి బిరుదులు ప్రసాదించవచ్చు. పొందవచ్చు. భారతరత్న, పద్మ విభూషణ్ లాంటి వాటిని పొందినవారు వీటిని తమ 'గౌరవాలు'గా పరిగణించవచ్చు. కాని, 'బిరుదు లు'గా పరిగణించరాదు.

1995 డిసెంబరు 15న సుప్రీం కోర్టు, ఇలాంటి బిరుదుల విలువలను నిలుపుదల చేసింది.

స్వాతంత్ర్యపు హక్కు : భారత రాజ్యాంగం, తన అధికరణాలు 19, 20, 21, 22, ల ద్వారా స్వాతంత్ర్యపు హక్కును ఇస్తున్నది. ఇది వైయుక్తిక హక్కు ప్రతి పౌరుడూ ఈ హక్కును కలిగి వుండడం, రాజ్యాంగ రచనకర్తల అసలు అభిలాష. అధికరణ 19, క్రింది ఆరు స్వేచ్ఛలను పౌరులకు ఇస్తున్నది. వాక్-స్వాతంత్ర్యపు హక్కు భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యం, సమావేశాలకు స్వేచ్ఛ, ఈ సమావేశాలు శాంతియుతంగా, ఆయుధాలు కలిగి వుండరాదు, దేశం, ప్రజా శ్రేయస్సులను దృష్టిలో వుంచుకుని,




ప్రభుత్వాలు వీటి అనుమతులు నియం త్రించనూవచ్చు. సంస్థలు, సొసైటీలు స్థాపించే హక్కు దేశ, ప్రజా శ్రేయస్సు ల దృష్ట్యా ప్రభుత్వం వీటిని నియంత్రించవచ్చు లేదా నిషే ధించవచ్చు.

భారతపౌరుడు, భారతదేశం అంతర్భాగంలో ఏ ప్రాంతంలో నైనా పర్యటించవచ్చు. కాని కొన్నిసార్లు ప్రభుత్వం ప్రజాశ్రే యస్సు దృష్ట్యా అంటురోగం గల సమయాలలో వాటిని అరి కట్టే ప్రయత్నాలలో, పౌరుల ప్రయాణాలను నిషేధించవచ్చు. భారత అంతర్భాగంలో ఏ ప్రదేశంలోనైనా, పౌరులు, నివా సాన్ని ఏర్పరచుకోవచ్చు. కానీ, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ తెగల పరిరక్షణ దృష్ట్యా, ప్రభుత్వం కొన్ని నియంత్రణలు చేయవచ్చును. భారతదేశంలోని ఏ ప్రాంతంలోనైనా, పౌరులు వ్యాపారాలు, వర్తకాలు, ఉద్యోగాలు చేపట్టవచ్చు. నేరాలుగల వ్యాపారాలు, చీకటి వ్యాపారాలు, నీతిబాహ్య వ్యాపారాలు చేపట్టరాదు. ఏ వ్యక్తిని అక్రమంగా నిర్బంధించకూడదు. అక్రమ నిర్బం ధం నుంచి వ్యక్తి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు రక్షణ కల్పించడం కోసం 20వ అధికరణ ఉద్దేశించబడినది. ప్రాణాలు కాపాడుకోవడం వ్యక్తిగత స్వేచ్ఛ క్రిందనే పరిగణిం పబడుతుంది. అధికరణ 21 ప్రకారం, ఏ పౌరుడూ తన స్వేచ్ఛనూ, జీవితాన్ని కోల్పోయే హక్కు కలిగిలేదు. చట్టాన్ని తప్పించి. 22వ అధికరణ నిర్బంధ నివారణ చట్టం. ఈ అధికరణ ప్రకారం ఏ ఒక్క వ్యక్తిని కారణం లేకుండా నిర్బంధంలోకి తీసుకొనరాదు. నిర్బంధంలోకి తీసుకున్న 24 గంటల్లోపు సమీప న్యాయమూర్తి ఎదుట హాజరుపరచాలి. దోపిడీని నివారించే హక్కు బాల కార్మికుడు, 'స్వేచ్ఛారహిత కార్మికులు' (కట్టు బానిసలు) 2 . The right against exploita-tion, అధికరణాలు 23, 24ల ప్రకారం, కట్టు బానిసత్వం, బాలకార్మిక విధానాలు నిషేధం. 14 ఏళ్ల లోబడి గల బాలబాలికలకు అపాయకరమైన పను లు(కర్మాగారాలలో, గనులలో) చేయించుట నిషేధం. బాల కార్మిక విధానం, రాజ్యాంగ ఊపిరికే విఘాతం లాంటిది. కట్టు బానిసత్వం, విధానంలో భూస్వాములు లేదా పెత్తందార్లు, మానవ హక్కులకు విఘాతాలు కలుగజేసే వారు. మానవులకు కట్టుబానిసలుగా ఉంచుకొని, తరతరాల

స్వాతంత్ర్యాన్ని హరించివేసేవారు. ఈ దురాగతాన్ని మాన్పిం చడానికే ఈ హక్కు కల్పించబడింది. మానవులకు 'బానిస వర్తకాలు', 'వ్యభిచారం' వంటి అశ్లీల వృత్తుల యందు బలవంతంగా ప్రవేశించేలా చేయువారికి చట్టప్రకారం కఠిన శిక్షలున్నాయి. కానీ కొన్ని అత్యవసర సమయాలలో ప్రభుత్వాలు, జీతభత్యాలు లేని ఉద్యోగాలు, తప్పనిసరి సైనిక భర్తీలను చేపట్టుట లాంటి వాటిని, ప్రత్యేక పరిస్థితులలో అనుమతించవచ్చును.

మత స్వాతంత్రపు హక్కు : భారతదేశంలో పౌరులందరికీ మతస్వాతంత్ర్యపు హక్కును, అధికరణాలు(ఆర్టికల్స్) 25, 26, 27, 28ల ప్రకారం ఇవ్వబడింది. ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యం సెక్యులరిజం సూత్రాలను స్థాపించుటకు ఉద్దేశించినవి. భారత రాజ్యాంగం ప్రకారం, భారతదేశంలోని అన్ని మతాలు సమానమే. ఏ మతమూ ఇతర మతంపై ప్రాధాన్యతను కలిగి లేదు. ప్రతి పౌరుడు తన ఇష్టానుసారం మతాన్ని అవలంబించుటకు స్వేచ్ఛ కల్పింపబడ్డాడు. పౌరులు తమ మతాలగూర్చి ఉపన్యసించవచ్చు, అవలంబించవచ్చు. మతవ్యాప్తి కోసం పాటుపడవచ్చు. ధార్మిక సంస్థలు, ప్రజాపయోగ స్వచ్ఛంద సంస్థలను స్థాపించుకొనవచ్చు. ఇతరత్రా, మతసంబంధం కాని కార్యకలాపాలను, ప్రభుత్వం నిర్దేశించిన చట్టాల ప్రకారం చేపట్టవచ్చు. చారిటబుల్ సంస్థలను కూడా ప్రజాపయోగం, సుహృద్భావన, నియమాలను పునస్కరించుకొని, తమ కార్యకలాపాలు చేయునట్లుగా ప్రభుత్వం నిర్దేశించవచ్చును. మతపరమైన కార్యకలాపాల కోసం ఎలాంటి పన్నులను విధించగూడదు, నిర్దేశించగూడదు. ప్రభుత్వాలు నడిపే విద్యా సంస్థలలో, ప్రత్యేక మతాన్ని రుద్దే బోధనలు చేపట్టకూడదు. అలాగే, ఈ ఆర్టికల్స్‌ని విషయాలు, ప్రభుత్వాలు చేపట్టే ప్రజోపయోగ కార్యక్రమాలపై ఏలాంటి విఘాతాలు కలిగించగూడదు. ప్రభుత్వాలు చేపట్టే ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ విషయాలలో, ధార్మిక సంస్థల కార్యకలాపాలు అడ్డంకులుగా వుండరాదు. 25వ అధికరణ ప్రకారం ప్రతి వ్యక్తి తనకు నచ్చిన మతాన్ని స్వీకరించవచ్చు. 26వ అధికరణ ప్రకారం మత అభివృద్ధికి అవసరమైన ధార్మిక సంస్థలను స్థాపించుకోవచ్చు.

27వ అధికరణ ప్రకారం మతపరంగా ఏ వ్యక్తిపై ఏ విధమైన పన్నులు విధించరాదు. 28వ అధికరణ ప్రకారం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థలయందు మత ప్రబోధం చేయరాదు.

సాంస్కృతిక, విద్యాహక్కులు..

భారతదేశం, అనేక మతాలకు, భాషలకు, సంస్కృతులకు నిలయం. రాజ్యాంగం వీరికి కొన్ని ప్రత్యేక హక్కులను ఇస్తుంది. అధికరణ 29, 30ల ప్రకారం, మైనారిటీలకు కొన్ని హక్కులు ఇవ్వబడినవి. ఏ మైనారిటీలకు చెందిన వాడైనను, ప్రభుత్వం వీరికి, ప్రభుత్వ, ప్రభుత్వ సహాయం పొందిన సంస్థలలో ప్రవేశానికి నిషేధించరాదు. మైనారిటీలు, అనగా మతం, భాష, సాంస్కృతికపరమైన మైనారిటీలు, తమ మతాన్ని, భాషలనూ, సంస్కృతిని రక్షిం చుకొనుటకు, మైనారిటీ సంస్థలు స్థాపించుకొనవచ్చు. ఆ సంస్థల ద్వారా వారు, తమ అభ్యున్నతికి పాటు పడ వచ్చు. ఈ సంస్థలలో దుర్వినియోగాలు జరుగుతున్న సమయాన ప్రభుత్వాలు తమ ప్రమేయాలు కలుగజేసుకోవచ్చు.

29వ అధికరణ భారతదేశంలోని ప్రతి పౌరుడు తమ స్వీయ భాషను, పిని, సంస్కృతిని సంరక్షించుకోవచ్చు. 30వ అధికరణ దేశంలోని ఏ ప్రాంతం వారైనా తమ భాష, లిపి, సంస్కృతిని సంరక్షించుకోవడానికి అవసరమైన విద్యా సంస్థలను స్థాపించి నిర్వహించుకొనవచ్చు.

రాజ్యాంగ పరిహారపు హక్కు : 32వ అధికరణ రాజ్యాంగ పరిహారపు హక్కు ప్రాథమిక హక్కులకు ఏ పాటిదైనా భంగం కలిగితే, రాజ్యాంగ పరిహారపు హక్కును కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఉదాహ రణకు, పౌరుడు, జైలుశిక్షను పొందితే, ఆ వ్యక్తి, న్యాయస్థానా లను ఆశ్రయించి, ఇది దేశ చట్టాలనుసారంగా వున్నదా ? లేదా ? అని ప్రశ్నించే హక్కును కలిగి ఉన్నాడు. ఒక వేళ, న్యాయ స్థానం నుంచి జవాబు "కాదు" అని వస్తే, ఆ వ్యక్తికి తక్షణమే విడుదల చేయవలసి వస్తుంది. పౌరుల హక్కులను వాటి సంరక్షణలను గూర్చి న్యాయస్థానాలను అడిగే విధానాలు కొన్ని ఉన్నాయి. న్యాయస్థానాలు కొన్ని దావాలను ప్రవేశపెట్టవచ్చు. ఆ దావాలు, హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో వారంట్, సెర్టియోరారి, ఒక వేళ దేశంలో అత్యవసర పరిస్థితి ఏర్పడితే, ఈ హక్కులన్నీ కేంద్ర ప్రభుత్వంచే "సస్పెండు' చేయబడతాయి.

ఆస్తి హక్కు- క్రిత ప్రాథమిక హక్కు : భారత రాజ్యాంగం, ఆర్టికల్ 19, 31 వరకు గల విషయా లలో ఆస్తి హక్కును పౌరుల ప్రాథమికహక్కుగా పరిగణిం చింది, ఆర్టికల్ 19, పౌరులందరికీ, ఆస్తులను సంపాదించ భారతదేశంలో ప్రతి పౌరునికి గల ప్రాథమిక విధులు : భారత రాజ్యాంగాన్ని గౌరవించాలి. రాజ్యాంగపు ఆదర్శాలను, సభలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలి. భారత స్వాతంత్ర సంగ్రామంలో, ప్రోత్సహింపబడ్డ ఆదర్శాలను గౌరవించాలి. భారతదేశపు సార్వభౌమత్వాన్ని, అఖండత్వాన్ని, ఏక త్వాన్ని గౌరవించి, పెంపొందించాలి. అవసరం లేదా అవకాశం కలిగితే భారతదేశానికి సేవ చేసేందుకు ఎల్లవేళలా సిద్ధంగా వుండాలి. భారతదేశంలో, కుల, మత, వర్గ, లింగ, వర్ణ విభేదా లు లేకుండా ప్రజలందరిని గౌరవించాలి. సోదరభా వాన్ని, సౌభ్రాతృత్వాన్నీ పెంపొందించాలి. స్త్రీల యొక్క గౌరవమర్యాదలను భంగపరిచే అమర్యాదకరమైన ఆచారాలను పద్ధతులను విడనాడాలి. మన భారతదేశంలో గల మిశ్రమ సంస్కృతిని, మిశ్ర మ, అద్భుత వారసత్వాన్ని కాపాడుకోవాలి. ప్రకృతి పరిసరాలైన అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులు, ఇతర జీవులను సంరక్షించుకోవాలి. శాస్త్రీయ దృక్పథాన్ని, వైజ్ఞానిక విషయాలను పెంపొం దించి జ్ఞానాభివృద్ధి కోసం ఎల్లవేళలా పాటుపడాలి. ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆస్తులను కాపాడాలి. హింసను విడనాడాలి. భారతదేశం అభివృద్ధి చెందునట్లు, వ్యక్తిగతంగా, సామాజికంగా లేదా మిశ్రమంగాపాటు పడుతూ, దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ, దానిని సాధించుటకు కృషి చేయాలి. 6-14 ఏళ్ల పిల్లలకి నిర్బంధ విద్యను అందించాలి. దం, వుంచుకొనడం, అమ్మడం వంటి హక్కులను కలు గజేసింది. ఆర్టికల్ 31 'పౌరులెవ్వరూ తమ ఆస్తి హక్కును, ప్రభుత్వాల ద్వారా కోల్పోగూడదు'. ప్రభుత్వం ప్రజల అవసరాల రీత్యా పౌరుల ఆస్తిని గైకొన్న యెడల, ఆ ఆస్తిదారునికి 'కాంపెన్సేషన్' చెల్లించవలెనని కూడా నొక్కి వక్కాణిస్తుంది. కానీ భారత రాజ్యాంగ 44వ సవరణ ద్వారా, 1978లో ఈ ఆస్తి హక్కును, ప్రాథమిక హక్కుల జాబితానుంచి తొలగించింది. ఓ క్రొత్త ఆర్టికల్ 300- ఏ ప్రకారం రాజ్యాంగ హక్కుగా మార్చబడింది.

# పొడుస్తున్న పొద్దు మీద..

**కలిసి వచ్చే కాలానికి.. నడిచి వచ్చే సీసాలు**
**ముహూర్తం చూసి.. మద్యం సీసాలు అమ్మకాలు**
**ఈసారి చాలా మంది కొత్తవారు మద్యం వ్యాపారంలోకి దిగడంతో పూజలు, ముహూర్తాలపై మరింత శ్రద్ధలి**
**కొత్త మద్యం దుకాణాలు తొలిరోజే కిటకిట!**
**డిసెంబర్ 1ఉదయమే ప్రత్యేక పూజలతో యజమానుల హడావుడి..**
**పలుచోట్ల స్థానికుల అభ్యంతరాలు, అద్దెకు షాపులు దొరక్క బ్రేక్..**
**రాష్ట్రంలో కొత్త మద్యం దుకాణాలు తొలిరోజే కళకళలాడాయి**



హైదరాబాద్ బ్యూరో చీఫ్, డిసెంబర్ 2 (విజన్ ఆంధ్ర ): దుకాణాలు దక్కించుకున్నవారు.. సోమవారం ఉదయమే దుకాణాలను అలంకరించి, పండితులను పిలిపించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో హడావుడి కనిపించింది. నిర్వాహకులు తమకు కలిసివచ్చే ముహూర్తం చూసుకుని షాపులు తెరిచి, విక్రయాలు మొదలుపెట్టారు. బేవరేజెస్ కార్పొరేషన్ డిపోల నుంచి ఆదివారం అర్ధరాత్రి దాకా ఆయా మద్యం దుకాణాలకు సరుకు సరఫరా కావడంతో తొలి రోజే కొత్తస్టాక్‌తో విక్రయాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలుండగా.. ఈసారి చాలా మంది కొత్తవారు మద్యం వ్యాపారంలోకి దిగడంతో పూజలు, ముహూర్తాలపై మరింత శ్రద్ధపెట్టినట్లు కనిపించింది. తొలిరోజే దుకాణాలు కిటకిటలాడాయి. ఇక హైదరాబాద్‌తో పాటు పలు జిల్లా కేంద్రా ల్లో ఈసారి చాలా మద్యం దుకాణాల్లో అనుబంధంగా వాకిన్ స్టోర్లను ఏర్పాటు చేశారు. సూపర్ మార్కెట్ల తరహాలో వినియోగదారులు వాటిలోపలికి వెళ్లి నచ్చిన మద్యాన్ని ఎంచుకుని కొనుగోలు చేయవచ్చు. లైసెన్సు ఫీజుకు అదనంగా రూ. 5లక్షలు చెల్లించిన మద్యం దుకాణాలకు ఈ అవకాశం. ఈ కొత్త దుకాణాల పాలసీ గడువులో ప్రభుత్వానికి గతంలో కంటే భారీగా ఆదాయం వస్తుందని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

కొన్నిచోట్ల ఆగిన ప్రారంభం

కొత్త మద్యం దుకాణాలకు పలుచోట్ల స్థానికులు అభ్యంతరం తెలపడంతో ప్రారంభం కాలేదు. దేవాలయాలు, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాల్లో దుకాణాలు చేస్తుండటంపై స్థానికుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. మరికొన్ని చోట్ల తగిన షాపులు అద్దెకు దొరక్కపోవడంతోనూ ప్రభావం పడింది.

రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ పరిధిలో దాదాపు 25 దుకాణాలు సోమవారం ప్రారంభం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒకటిరెండు చోట్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నారు...

## ఏసీబీ అధికారులమంటూ ఎవరైనా ఫోన్ చేసినా, డబ్బులు అడిగినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయండి

## ఆదిలాబాద్ రేంజ్ డీఎస్పీ



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 01, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా పరిధిలో... ఎవరైనా వ్యక్తులు ఏసీబీ అధికారులమంటూ ఎవరైనా ఫోన్ చేసినా, డబ్బులు అడిగినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని.. ఏసీబీ అధికారులమని, మా ఏసీబీ అధికారులు ఎవరికి ఫోన్ చేయరు, డబ్బులు అడగరు అని.. మీ ఫిర్యాదు లకై...చేసే సేవ... పూర్తిగా ఉచితం కాబట్టి దయచేసి ఎవరికి ఏసీబీ పేరు మీద డబ్బులు ఇవ్వవద్దు. మోసపోవద్దు. అని.. ఎవరైనా ఏసీబీ అధికారులమని డబ్బులు అడిగితే ఈ మొబైల్ నెంబర్ o91 91543 88963కి సమాచారం అందించండి అని ఆదిలాబాదు రేంజ్ డీఎస్పీ కోరారు.

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ నేరాల అవగాహన కార్యక్రమం & 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' పోస్టర్ ఆవిష్కరణ




సిద్దిపేట జిల్లా (విజన్ ఆంధ్ర ప్రతినిధి ) డిసెంబర్ 2: సిద్దిపేట జిల్లాలో గల పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యపరచడానికి 'సైబర్ అవగాహన కార్యక్రమం'నిర్వహించబడింది. తెలంగాణ డీజీపీ, టిజిసిఎస్‌బి డైరెక్టర్శికా గోయల్గారి ఆధ్వర్యంలో హైదరాబాదులోని టి జి ఐ సి సి సి లో 'ఫ్రాడ్ క ఫుల్ స్టాప్' ప్రోగ్రాం ఆవిష్కరించడం జరిగింది. అందులో భాగంగా సైబర్ నేరాల నివారణకు ఉద్దేశించిన 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' పోస్టర్‌ను సైబర్ క్రైమ్ ఏ.సి.పి. శ్రీనివాసు గారు ఆవిష్కరించారు. సైబర్ క్రైమ్ ఏ.సి.పి. శ్రీనివాసుగారుమాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయో, వాటిని ఎలా నివారించవచ్చో ప్రజలకు వివరించారు. ఏ.సి.పి. శ్రీనివాసు గారి కీలక సూచనలు: బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్, పాన్ కార్డ్ నంబర్లు మరియు ముఖ్యంగా మొబైల్‌కు వచ్చే లిఒ.టి.పి. పాస్వర్డ్మయము) లనుఎవరితోనూపంచుకోవద్దు.సోషల్ మీడియా లేదా మెసేజ్‌ల ద్వారా వచ్చే తెలియని లింక్‌లు (లింక్స్) యాప్‌లను ( ఏ పి పి ఎస్ పి) ఇన్‌స్టాల్ చేయకూడదు.పార్ట్ టైమ్ ఉద్యోగాలు, అధిక లాభాల పేరుతో వచ్చే ఆన్‌లైన్ ప్రకటనలను నమ్మి డబ్బులుచెల్లించకూడదు.మీ వ్యక్తిగత మరియు ఆర్థిక సమాచారాన్ని సోషల్ మీడియా వేదికల్లో లేదా పబ్లిక్ వైఫై (Wi-Fi) లలోఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి.ఒకవేళ మీరు సైబర్ నేరానికి గురైతే, వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల www.cybercrime.gov.in లో ఫిర్యాదుచేయాలని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమం ప్రజలలో సైబర్ నేరాలపై మరింత అవగాహన పెంచడంలోదోహదపడుతుందని ఏ.సి.పి. శ్రీనివాసు గారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండాలని కోరారు.

## కాలనీల సమస్యలపై పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ





శేరిలింగంపల్లి.డిసెంబర్ 2 ( విజన్ ఆంధ్ర): ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ మాట్లాడుతూ వెంకటేశ్వర నగర్, శిల్ప గార్డెన్, వుడ్ ల్యాండ్ ప్రీమియర్ కాలనీల వాసుల విజ్ఞప్తి మేరకు ఈ రోజు కాలనీల లో పాదయాత్ర చేయడం జరిగినది అని , వెంకటేశ్వర నగర్, శిల్ప గార్డెన్, వుడ్ ల్యాండ్ ప్రీమియర్ కాలనీ లో నెలకొన్న డ్రైనేజి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని, డ్రైనేజి సమస్య కు శాశ్వత పరిష్కారం చూపుతామని, మ్యాన్ హోల్ నుండి మ్యాన్ హోల్ వరకు పూడిక తీసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ఔట్ లెట్ సమస్య ను త్వరితగతిన పరిష్కరించాలని జలమండలి అధికారులకు ఆదేశించారు. అవసరమున్న చోట మ్యాన్ హోల్స్ పునరుద్ధరించాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన, డ్రైనేజి మరియు రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని. త్వరలనే సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని, యు జి డి నిర్మాణం పనులు చేపడుతుమని డ్రైనేజి ఔట్ లెట్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, డ్రైనేజి సమస్య కు శాశ్వత పరిష్కారం చూపుతామని, కాలనీ లో మంచి వాతావరణం కల్పిస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంత మైన ప్రయాణానికి బాటలు వేస్తామని అన్ని రోడ్ల ను దశల వారిగా చెప్పటి పూర్తి స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరు స్తామని, వీధి దీపాలను ఏర్పాటు చేస్తామని , సమస్యలను దశల వారిగా త్వరలోనే పరిష్కరిస్తామని , మంచి నీటి వ్యవస్థను మెరుగు పరుస్తామని అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల పనులు వెంటనే చేపట్టి ప్రజలకు ఉపశమనం కలిగేలా చూడలని, డ్రైనేజి ఔట్ లెట్ సమస్యను త్వరలోనే పరిష్కరించాలని అధికారులకు తెలియచేసారు. పార్క్ లకు నిధులు మంజూరు అయినవి అని ,త్వరలోనే శంకుస్థాపన చేసుకుందామని, పార్క్ లను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని, పార్క్ లను సుందరవణంగా తీర్చిదిద్దుతామని, కాలనీ వాసులకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని, పిల్లలకు ,వృద్దులకు, కాలనీ వాసులకు ఉపయోగపడే విధంగా పార్క్ లను తీర్చిదిద్దుతామని, ఒక ఆట విడుపుగా ఉపయోగపడతాయి అని PAC చైర్మన్ గాంధీ గారు తెలియ చేశారు. అదేవిధంగా ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని ,ఎల్లవేళలో మీకు అందుబాటులో ఉంటానని, తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఈ ఈ శిరీష, డి ఈ ఆనంద్, జాలమండలి మేనేజర్ సందీప్ , నాయకులు మరబోయిన రాజు యాదవ్,గణేష్ ముదిరాజు, కోడిచెర్ల రాములు, సత్యం, శశాంక్ పవన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం డిసెంబరు 3వ తేదీన నిర్వహిస్తారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగులు ఎదుగుదలను ప్రోత్సహించేలా ఈ దినోత్సవం ప్రయత్నిస్తుంది. వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరానిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనం లో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడంకోసం 1992లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈ దినోత్సవం మొదలై,1998 నుండి ప్రతి సంవత్సరం వికాలాంగులకు సంబంధించిన ఒక అంశంతో అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కలిపించి వారందరిని సమాజ అభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో 1976లో ఐక్యరాజ్య సమితి 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరం గా ప్రకటించింది. అలాగే 1983 నుండి 1992 వరకు ఐక్యరాజ్య సమితి వికలాంగుల దశాబ్దంగా ప్రకటించింది. ఈ దినోత్సవం రోజున ప్రపంచవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతాయి. కాలిబర్, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు వంటివి బహుకరిస్తారు. వివిధ పాఠశాలలోని వికలాంగ విద్యార్థులకు పిల్లలకు ప్లేట్లు, టిఫిన్ బాక్సులు, వాటర్ బాటిళ్లు... భవిత కేంద్రంలోని చిన్నారులకు బిస్కెట్లు, క్రీడా సామగ్రిని అందజేస్తారు.వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తారు.

# ఆంధ్రప్రదేశ్ కు అండగా నిలవండి

**మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన ఏ.పి.ని ఆదుకోండి**

**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నేతృత్వంలో, రాష్ట్ర హెూం శాఖ మంత్రి వర్యులు అనిత, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు,సహచర ఎంపీల బృందంతో కలిసి కేంద్ర మంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**

**కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్న చిత్తూరు పార్లమెంటు సభ్యులు**



చిత్తూరు, డిసెంబర్ 02 ('విజన్ ఆంధ్ర ): మొంథా తుఫాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ను ఆదుకోవాలని,.. కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాకు.. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నేతృత్వంలో, రాష్ట్ర హెూం శాఖ మంత్రి వర్యులు అనిత, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు,, కూటమి ఎంపీల బృందంతో కలిసి విజ్ఞప్తి చేసినట్లు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు వెల్లడించారు.

మొంథా తుఫాను ప్రభావం వల్ల ఆంధ్రప్రదేశ్కు సంభవించిన నష్టాన్ని కేంద్రానికి వివరించేందుకు ఢిల్లీకి విచ్చేసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు, హెూంశాఖ మంత్రి వర్యులు అనితలకు దేశ రాజధాని న్యూఢిల్లీలో సాదర స్వాగతం పలికిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.., ఆంధ్రప్రదేశ్ కూటమి ఎంపీల బృందం .., మొంథా తుఫాను కారణంగా జరిగిన నష్టం అంచనా సమగ్ర నివేదికను, మంగళవారం ఉదయం న్యూఢిల్లీలో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి అందజేసినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు వెల్లడించారు. ఏపీకి అండగా నిలవాలని కేంద్ర హెూంశాఖ మంత్రిని తాము కోరినట్లు చెప్పారాయన. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు, రాష్ట్ర హెూం శాఖ మంత్రి వర్యులు అనిత, కూటమి ఎంపీల బృందం మొంథా తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్ కు జరిగిన నష్టాన్ని సవివరంగా కేంద్ర హెూంశాఖ మంత్రికి తెలియపరచినట్లు ఆయన చెప్పారు. మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో అన్నిరంగాలకు కలిపి రూ. 6,352 కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పిన ఎంపీ దగ్గుమళ్ళ. మొంథా తుపాను ఉగ్రరూపానికి సుమారు 3,109 గ్రామాలు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని అమిత్ షాకు సమగ్రంగా వివరించినట్లు తెలిపారు. నిద్రఫ్ మార్గదర్శకాల ప్రకారం రూ. 6,356 కోట్ల మేర నష్టం వాటిల్లిందనీ..,తక్షణ ఉపశమనం , తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ. 902 కోట్లు రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించి ఆంధ్రప్రదేశ్ ఆదుకోవాలని తాము కేంద్ర హెూంశాఖ మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు వివరించారు. కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి వారిలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు, రాష్ట్ర హెూం శాఖ మంత్రి వర్యులు అనితలతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కూటమి ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సానా సతీష్, కేశినేని శివనాథ్, అప్పల నాయుడు, బస్తిపాటి నాగరాజు, భరత్, లావు కృష్ణదేవరాయలు, పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, టిడిపి సీనియర్ నేతలు కంభంపాటి రామ్మోహన్ రావు, కనకమేడల రవీంద్ర కుమార్ తదితరులు ఉన్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు.

## ఎస్టి వసతి గృహ విద్యార్థులకు అస్వస్థత విద్యార్థులకు చికిత్స

### జిల్లా కలెక్టర్ బి. యం.. సంతోష్



గద్వాల డిసెంబర్ 2(విజన్ ఆంధ్ర): గద్వాలలోని ఎస్టి వసతి గృహ విద్యార్థుల్లో కొందరు అస్వస్థతకు గురి కావడంతో అవసరమైన చికిత్స చేయించినట్లు జిల్లా కలెక్టర్ బి. యం.. సంతోష్ తెలిపారు. మంగళవారం ఉదయం గద్వాల ఎస్టీ బాలుర వసతి గృహ విద్యార్థులు టిఫిన్ చేసి వారి పాఠశాలలకు వెళ్లాక సమీపంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ప్రార్థన సమయంలో ఎండ కారణంగా కొంత అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. వారికి ఉపాధ్యాయులు వెంటనే విశ్రాంతి కల్పించారన్నారు. కాసేపటికి మరో 12 మంది విద్యార్థులు కూడా ఇబ్బంది పడడంతో ఉపాధ్యాయులు సంబంధిత అధికారులకు తెలియజేశారని కలెక్టర్ పేర్కొన్నారు. వెంటనే ఉపాధ్యాయులు 14 మంది విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. వీరందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారని, ప్రథమ చికిత్స అనంతరం ఆరోగ్యం నిలకడగా ఉండడంతో వెంటనే విద్యార్థులందరిని డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికార యంత్రాంగం ఆసుపత్రికి వెళ్లి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఎవరు కూడా ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జరిగిన ఘటనపై విచారణ జరిపిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

## మాజీ సర్పంచ్ మరియు వార్డు మెంబర్ కాంగ్రెస్ లో చేరిక కండువా కప్పి ఆహ్వానించిన జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 01, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ బిఆర్ఎస్ నాయకుడు మాజీ సర్పంచ్ ఎల్మ నారాయణ రెడ్డి. వార్డ్ మెంబర్ గంట దేవిదాస్ లు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించి కండువాకప్పిన మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి. మాజీ ఎంపీపీ కళ్యాణ%శీ% లక్ష్మి రాజేశ్వర్. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు యు కమలాకర్. వెంకన్న యాదవ్. మాజీ సర్పంచ్ ఎం గణేష్. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్. పోశెట్టి. పూర్ణచేందర్. తిరుపతి. శ్రీకాంత్. నారాయణ. చిన్న భూమన్న శారత రవి. జీవన్ తిరుపతి. ఆశన్న తదితరులు పాల్గొన్నారు

## ఏర్పాట్లను పరిశీలించిన... జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 01,( విజన్ ఆంధ్ర) ఈ నెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదిలాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేసారు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## జగ్గసాగర్ పి హెచ్ సి ఆకస్మిక తనిఖీ

### డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి



కోరుట్ల ఆర్సీ, డిసెంబర్ 02 ( విజన్ ఆంధ్ర ) : జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలంలోని జగ్గసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము మంగళవారం జిల్లా ఉప వైద్య అండ్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్నటువంటి సేవలు, గర్భిణి స్త్రీలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే సాధారణ కాన్పులు చేసుకోనే విధంగా, సాధారణ కాన్పుల వల్ల కలిగే లాభాలపై గర్భిణీ స్త్రీలకు గ్రామాలలో అవగాహన కల్పించాలని ఏఎన్ఎం, ఆశా వర్కర్స్, వైద్య సిబ్బందికి సూచించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి, డాక్టర్ తాటిపర్తి శివాని, సిహెచ్ఓ వెంకట లక్ష్మి, హెచ్ఈఓ రమేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం



కోరుట్ల ఆర్సీ, డిసెంబర్ 02 ( విజన్ ఆంధ్ర ) : జగిత్యాల జిల్లా మెట్పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని మంగళవారం మెట్పల్లి ఆటో స్టాండ్ వద్ద నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్మల శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ డ్రైవర్లకు కాలుష్య నియంత్రణ పై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాస్ రావు, అశోక్, కొండస్వామి, సాగర్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## నార్నూర్ మండలానికి ప్రధానమంత్రి అవార్డు దేశవ్యాప్తంగా టాప్-5 ప్రదర్శనలో స్థానం, గవర్నర్ అవార్డు,

**స్టేట్స్ యూజ్-కేస్ చాలెంజ్‌లో 8 లక్షలు, ఎడ్యుకేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్, నీతి ఆయోగ్ నుండి 7 ప్రశంసా పురస్కారాలు జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 01, (విజన్ ఆంధ్ర) నీతి ఆయోగ్ విడుదల చేసిన 2025 సెప్టెంబర్ త్రైమాసిక డెల్టా ర్యాంకింగ్స్‌లో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం దేశవ్యాప్తంగా ఉన్న 500 బ్లాక్‌లలో 4వ స్థానం, అలాగే దక్షిణ భారతంలోని జోన్-3లో 1వ ర్యాంక్ సాధించిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. ఈ అసాధారణ ప్రదర్శనకు గుర్తింపుగా నార్నూర్ మండలానికి రూ. 1.5 కోట్లు పురస్కారం లభించిందని తెలిపారు. ఇటువంటి జాతీయ స్థాయి గుర్తింపు మరోసారి రావడం నార్నూర్ మండలాన్ని దేశంలోని అత్యుత్తమ ప్రదర్శన చేసే మండలాల్లో ఒకటిగా నిలబెట్టడమే కాక, ఇది మొత్తం జిల్లా ప్రజలకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. తాజాగా వచ్చిన డెల్టా ర్యాంకింగ్స్‌తో పాటు, నార్నూర్ ఇప్పటి వరకు వివిధ పురస్కారాలు, ప్రోత్సాహకాలను కలిపి మొత్తం రూ. 2.78 కోట్లు పొందింద ని తెలిపారు. వీటిలో ప్రధానమంత్రి అవార్డు, దేశవ్యాప్తంగా టాప్-5 ప్రదర్శనలో స్థానం, గవర్నర్ అవార్డు, స్టేట్స్ యూజ్-కేస్ చాలెంజ్‌లో 8 లక్షలు, ఎడ్యుకేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్, అదేవిధంగా నీతి ఆయోగ్ నుండి 7 ప్రశంసా పురస్కారాలు ఉన్నాయన్నారు. ఈ విజయాలు నార్నూర్ మండలంలోని నిరంతర అభివృద్ధి, శ్రేష్ఠ పాలనతో పాటు ప్రజాకేంద్రీకృత కార్యక్రమాలను ప్రతిబింబంగా నిలుస్తున్నాయనీ కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో....

### జిల్లా కేంద్రంలోని మరాఠీ మీడియం హై స్కూల్ విద్యార్థులకు బుక్స్ కంపాక్స్ బాక్సెస్ పంపిణీ



అదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 01, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫర్ సొసైటీ అధ్యక్షులు... అబ్దుల్ అజీజ్ తన కుమారుని పుట్టినరోజు సందర్భంగా స్థానిక మరాఠీ మీడియం హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు నోటుబుక్కులు కంపాక్షులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియంక, అడ్వకేట్ రాణా ప్రతాప్ ఠాగూర్ బెస్ట్ ఫ్రెండ్స్ సేవా వెల్ఫర్ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నోటుబుక్కులు కంపాక్షులు పంపిణీ చేయడంతో పాటు పాఠశాలల్లో చదువుపై ఎక్కువ శ్రద్ధ ఉన్న నలుగురు విద్యార్థులను ఎంపిక చేసి వారికి బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శిల్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజు పెళ్లిరోజు ఇతర శుభకార్యా లో ఉన్నప్పుడు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు. వారు చేసే సహాయం చిన్నగా పెద్దదా అనేది కాదు అని తెలిపారు సహాయం చేయడం వల్ల ఎందరోకో లాభాలు చేకూర్తాయని తెలిపారు. సేవ చేయటానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని తెలిపారు. సేవ ఏ సమయంలోనైనా చేయవచ్చని తెలిపారు. అనంతరం డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ అన్ని కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు చేస్తారని కానీ సేవా కార్యక్రమాలు మాత్రం స్వచ్ఛంద సేవలు మాత్రమే చేస్తాయని తెలిపారు స్వచ్ఛంద సేవకులు ఏసేవా కార్యక్రమం చేయటానికైనా ముందుంటారని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులకు నోటు పుస్తకాలు కంపాక్షులు పౌచులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## విత్తన బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 01 , (విజన్ ఆంధ్ర) ముసాయిదా విత్తన బిల్లు-2025 రూపకల్పనలో ప్రతి వర్గ అభిప్రాయం కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతులు, విత్తన డీలర్లు, కంపెనీలు, రైతు ఉత్పాదక సంఘాలు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్న ప్రత్యేక సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త విత్తన బిల్లు రైతు ప్రయోజనాలను కాపాడేలా, నాణ్యమైన విత్తనాల సరఫరాపై కట్టుదిట్టమైన నియంత్రణలు ఉండేలా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయి రైతు నుంచి శాస్త్రవేత్త వరకు అందరి సూచనలు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు. అందరి సూచనలను లిఖితపూర్వకంగా సేకరించి రాష్ట్రానికి పంపాలని, నకిలీ విత్తనాలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాల కొరత, అధిక ధరలు, నకిలీ విత్తనాల విక్రయం, విత్తనం వల్ల పంట నష్టపోయినప్పుడు కంపెనీల బాధ్యత వంటి అంశాలను ప్రస్తావించారు. పంటలు విఫలం అయినప్పుడు రైతుకు రక్షణ కల్పించే విధానాలు బిల్లులో ఉండాలని కోరారు. రైతు ఉత్పాదక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, స్థానిక విత్తన ఉత్పత్తికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని, నిల్వ, రవాణా సదుపాయాలను విస్తరించాలని కోరారు. చిన్న రైతులకు అందుబాటులో ఉండే విధంగా విత్తన విధానం ఉండాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ,విత్తన తనిఖీ దళాల బలోపేతం, ల్యాబ్‌లలో ఆధునిక పరికరాలు, రైతులకు అవగాహన కార్యక్రమాల అవసరాన్ని వివరించారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, ఏడిఏ లు, విత్తన కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కు స్వాగతం పలికిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



ఆదిలాబాద్ జిల్లా. ప్రతినిధి,డిసెంబర్ 01 , (విజన్ ఆంధ్ర) ఈనెల 4 వతేదీన ఆదిలాబాద్ జిల్లాకేంద్రములో జరగనున్న సీఎం రేవంత్ రెడ్డిగారి పర్యటన దృశ్యా ఏర్పాట్లను పర్యవేక్షిం చడానికి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసినటువంటి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ని మావల బైపాస్ తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఘన స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి స్వాగతం పలికి వారితో కలిసి సభా స్థలి ఏర్పాట్లను పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపూరావు, వేణుగోపాల చారి, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజక వర్గం ఇంచార్జులు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్, శ్యామ్ నాయక్, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవ్ రెడ్డి, గంద్రత్ సుజాత, గణేష్ రెడ్డి, సంతోష్ రావు , దేరా కృష్ణ రెడ్డి, మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్ర శేఖర్, మాజీ వైస్ ఎంపిపి అట్ల గోవర్ధన్ రెడ్డి, రహీం ఖాన్, రెండ్ల రాజన్న , ప్రవీణ్ రావుల, అలీమ్ ఖాన్ ,సమీఉల్లా ఖాన్ , దినేష్ ,అక్షయ్ ఉన్నారు.

## రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ గా దురిశెట్టి మనోహర్ నియామకం



కోరుట్ల ఆర్సీ, డిసెంబర్ 02 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల సంస్థ (రెడ్కో) ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ గా రిటైర్డ్ ఏడీఈ దురిశెట్టి మనోహర్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవిలో తాను ఏడాదికాలం పాటు కొనసాగుతారని తెలిపారు. విద్యుత్ సంస్థలో మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన అనుభవం, వినియోగదారులు, రైతులతో విస్తృత పరిచయాలు ఉండటం వల్ల హరిత ఇంధన ఉత్పత్తి లో పీఎం-సూర్యఘర్, పీఎం-కుసుమ్, ఈవీ- ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, తదితర ప్రభుత్వ పథకాల అమలు, సోలార్ రూఫ్ టాప్ ల ఏర్పాటు, వ్యవసాయ భూముల్లో రైతుల ప్రైవేట్ సోలార్ ప్రాజెక్టుల స్థాపన, ప్రభుత్వ భవనాలపై సోలార్ పలకల ఏర్పాటు వంటి నిర్దేశించిన లక్ష్యాలను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేగవంతంగా సాధించడంలో దురిశెట్టి మనోహర్ సఫలం అవుతారని భావిస్తున్నట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెడ్కో చైర్మన్ డా. శరత్, ఎండీ అనిల తదితరులకు దురిశెట్టి మనోహర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ, హరిత ఇంధన ఉత్పత్తికి సంబంధించి ప్రభుత్వ ప్రోత్సాహకాలు, వారికి కలిగే లాభాల గురించి వినియోగదారుల్లో అవగాహన కల్పించి సమన్వయం చేస్తానని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తానని దురిశెట్టి మనోహర్ పేర్కొన్నారు.

## అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని విజయవంతం చేయండి : విక్రమ కుమార్ రెడ్డి

చిత్తూరు, డిసెంబర్ 02 ( విజన్ ఆంధ్ర ) : అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు వికలాంగులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దివ్యాంగుల సహాయ సంచాలకులు ఇంచార్జ్ విక్రమ కుమార్ రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. " జిల్లా కలెక్టరు, చిత్తూరు వారి ఆదేశాలు మేరకు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని" 03-12-2025 మహాత్మా జ్యోతి రావు పులే, బి.సి.భవన్, చిత్తూరు నందు ఉదయం 10:00గం౹౹ల నుండి జరుపబడును. ఈ కార్యక్రమమునకు జిల్లా కలెక్టరు వారు జిల్లా అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొనుదురు. చిత్తూరు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు మరియు విభిన్న ప్రతిభావంతుల కొరకు పని చేస్తున్న సంఘాల నాయకులు మరియు స్వచ్ఛంధ సేవా సంస్థలను ఈ సభకు హాజరై జయప్రదము చేయవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

"అందరూ ఆహ్వానితులే"

సహాయ సంచాలకులు (I/C) విక్రమ్ కుమార్ రెడ్డి విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, చిత్తూరు.

## సర్పంచ్ స్థానాలన్నీ బిజెపి కైవసం చేసుకుంటుంది: బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్



బజార్ హత్నూర్,డిసెంబర్ 01, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని అన్ని సర్పంచ్ స్థానాలను బిజెపి కైవసం చేసుకుంటుందని బిజెపి మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బజార్ హత్నూర్ మండలంలో మంగళవారం స్థానిక ఎన్నికలపై బిజెపి సమావేశం నిర్వహించారు. వార్డు మెంబెర్స్ తో సహా అన్ని సర్పంచ్ స్థానాలను గెలుపే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని, ప్రతీ కార్యకర్త, నాయకులు అందుకు తగినట్లుగా కృషి చేయాలని తెలిపారు. మండల కేంద్రానికి చెందిన యువ నాయకుడు సిడాం వికాస్ కు బిజెపి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వ పథకాలు, బిజెపి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితమై తాను బిజెపి లో చేరానని వికాస్ తెలిపారు.

## ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన చేయాలి : కలెక్టర్ దివాకర్ టీఎస్

ములుగు జిల్లా : ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన చేసిన పక్షంలో విద్యార్థిని విద్యార్థులలో విజ్ఞానం పెంపొందించవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏ స్వేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని 40 ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కెరియర్ గైడెన్స్ పై ఒక్కరోజు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల కెరీర్ ఎంపికలో స్పష్టత, దిశానిర్దేశం ఎంతో ముఖ్యమని, 30 ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని అన్నారు.

## కొమురం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలిగా నియామక పత్రం అందుకున్న ఆత్రం సుగుణక్క



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 01, (విజన్ ఆంధ్ర) తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాదులోని గాంధీ భవన్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా నూతనంగా నియమితులైన సుగుణక్కకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చేతుల మీదుగా అధికారిక నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ..పార్టీ కేంద్ర నాయకత్వం, రాష్ట్ర నాయకత్వం నాపై ఉంచిన నమ్మకానికి హృదయపూర్వక ధన్యవాదాలు. డీసీసీ అధ్యక్షురాలిగా నాకు వచ్చిన ఈ బాధ్యతను శ్రద్ధగా, నిజాయితీగా నిర్వర్తిస్తాను. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం జిల్లా వ్యాప్తంగా నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పోతూ ముందుకు సాగుతాను. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సమన్వయంతో కృషి చేస్తామని అన్నారు.

# పర్యాటక, చారిత్రక వైభవాన్ని చాటేలా గండికోట ఉత్సవాలు

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సాస్కి పథకం ద్వారా చేపట్టిన ప్రాజెక్టు పనుల పరిశీలన

కడప, డిసెంబర్ 2 : జిల్లా పర్యాటక, చారిత్ర, సాంస్కృతిక వైభవాన్ని దేశం నలు దిక్కులా చాటేలా. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని అలాగే సాస్కి పథకం ద్వారా గండికోట పర్యాటక కేంద్రానికి ప్రపంచ స్థాయిలో కీర్తిని ప్రతిబింబించేలా అభివృద్ధి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం గండికోట ఉత్సవాల ఏర్పాట్లు, సాస్కి పర్యాటక అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.గండికోట పర్యాటక క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ, ఏపిటిడిసి అధికారులు, కాంట్రాక్టు ప్రతినిధులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గండికోట పర్యాటక కేంద్రం అభివృద్ధి పథకంలో భగంగా చేపట్టే అన్ని రకాల పనులకు సంబంధించిన నిర్వహణ పనులను, మ్యాపులను, డిజైన్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందించారు. పనుల నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా. అన్ని రకాల పర్యటన ప్రాజెక్టులను చేపట్టాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల్లో క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం ప్రత్యేక సహకారం (SASCI) అందించే పథకం ద్వారా.గండికోట పర్యాటక కేంద్రంలో సుసంపన్నమైన కోట మరియు గార్జ్ అనుభవాన్ని పర్యాటకుల సొంతం చేసే దిశగా.జిల్లా యంత్రాంగం పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. జనవరి నెల మొదటి వారంలో ప్రారంభం కానున్న గండికోట ఉత్సవాలను



జిల్లా పర్యాటక, చారిత్ర, సాంస్కృతిక వైభవాన్ని దేశం నలు దిక్కులా చాటేలా.దేశం నలుమూలలా విస్తరింపజేసేలా కొన్ని ప్రధాన్యమైన పనులను త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతోందన్నారు. ఉత్సవాలకు మునుపే పూర్తి కావాల్సిన పలు ముఖ్యమైన పనులను పరిశీలించి.. ఎంట్రన్స్, వెలివేషన్, పార్కింగ్, అమినిటీ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిటిడిసి ఇంజనీర్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ లను ఆదేశించారు. ఏపీ టూరిజం కార్పోరేషన్ తో ఏపీలో అమలు చేస్తున్న టూరిజం పాలసీలో భాగంగా పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హెూదా కల్పిస్తున్నామన్నారు. గండికోట ప్రాంతాన్ని సాస్కి పథకం ద్వారా రూ.79 కోట్లతో అభివృద్ధి చేసి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే పర్యాటకులు బస చేసేలా స్టార్ హెూటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. పర్యాటకులకు సంతృప్తికరమైన అనుభూతిని అందించేందుకు 10,000 SFT విస్తీర్ణంలో టూరిస్టు ఎక్స్ పీరియన్స్ సెంటర్ ను, 4000 SFT విస్తీర్ణంలో రెండు అమినిటీస్, ఇన్ఫర్మేషన్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. అలాగే ఒక టెంట్ సిటీ, 1.5 కిలో మీటరు మేరా గండికోట ఫోర్టు నుండి విజిటర్స్ సెంటర్ వరకు వాకింట్ ట్రెయల్ ను నిర్మించడం జరుగుతోందన్నారు. ఈ మార్గం మొత్తం కూడా వెహికల్ ఫ్రీ జోన్ గా కేటాయించి.. ఈ మార్గానికి ఇరువైపులా పర్యాటకులు చక్కటి ఆహ్లాదకరమైన అనుభూతిని పొందేలా పలు ప్రత్యేక నిర్మాణాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. టూరిస్టులను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్ తో పాటు, చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గార్జ్ పరిసరాల్లో ఎకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్ తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు.

ఈ ప్రాజెక్టు సందర్శించిన వారికి మంచి అనుభూతి కలిగేలా రోప్ వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రాండ్ కాన్యన్ ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ సదుపాయం కూడా కల్పించే సందుపాయం కల్పించే పనులకు ప్రాజెక్టులను సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారావాన్ టూరిజం సర్వీసులు కూడా అందుబాటులోకి రానున్నాయన్నారు. అలాగే గండికోట కొట్టాలపల్లె నుండి గండికోట రిజర్వాయర్, డ్యామ్ అందాలను వీక్షించడంతో పాటు.ఆ మార్గాన్ని కలిపే అనుకూలతలను,గండికోట గార్జ్ వ్యూ పాయింట్ వద్ద ఒబెరాయ్ స్టార్ హెూటల్ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ఏపీ టిడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, పిఆర్ ఎస్ఈ మద్దన్న, హౌసింగ్ పిడి రాజరత్నం, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ భాస్కర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ గోపీనాథ్, సైట్ ఇంజనీర్ విజయ్, ఆర్కిటెక్చర్ డిజైనర్లు ఇర్ఫాన్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

## సురక్ష డిజిటల్ జీవితానికి అవగాహనే ప్రధాన ఆయుధం.!

### డిజిటల్ ప్రపంచంలో భద్రత ప్రతి పౌరుని హక్కు.. ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ తో ఆ హక్కు బలోపేతం కు నాంది.! జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

గద్వాల డిసెంబర్ 2(విజన్ ఆంధ్ర): రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపు సైబర్ మోసాల నిరోధకం కోసం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ ను మంగళవారం తెలంగాణ రాష్ట్ర డి.జి.పి. బి. శివదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగముగా జిల్లా స్థాయిలో ప్రజలకు భద్రతాయుత డిజిటల్ వాతావరణం కల్పించడంపై పర్యవేక్షిస్తూ, దృష్టి సారించినట్లు జోగుళాంబ గద్వాల్ జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. డిజిటల్ లావాదేవీలు పెరిగిన యుగంలో సైబర్ మోసాలు, ఓటిపి. దొంగతనాలు, సోషల్ మీడియా హ్యాకింగ్, బ్యాంకు ఫిషింగ్, ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు వంటి సమస్యలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల భద్రత అత్యంత ముఖ్యమైందని ఎస్పీ పేర్కొన్నారు.సురక్షిత డిజిటల్ జీవితానికి అవగాహనే ప్రధాన ఆయుధం. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి, అంధ విశ్వాసంతో ఏ లింక్స్, ఓటిపి.లు, వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదు అని జిల్లా



ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమం డిసెంబర్ 2 నుండి జనవరి 12 వరకు పాఠశాలలు, కళాశాలలు, రూరల్ ప్రాంతాల్లో డిజిటల్ సేఫ్టీ ప్రచారం, సైబర్ అవగాహన శిబిరాలు కొనసాగనున్నట్టు తెలిపారు.ఇందులో భాగంగా సోషల్ మీడియా ద్వారా భద్రతా సందేశాలు, సైబర్ ఫ్రాడ్‌ను గుర్తించే సరళమైన పద్ధతులపై సైబర్ క్లబ్స్ ఏర్పాటు, వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ప్రజలు ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే ప్రధాన ఆయుధం. ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ ద్వారా ప్రతి ఇంటికి సైబర్ సురక్షితమైన సందేశం చేయాలని ఎస్పీ ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కే. శంకర్, గద్వాల్ డీఎస్పీ వై. మొగిలయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్ఐ సుకుర్, ఏ.హెచ్.టి.యు ఎస్ఐ కేశవరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు .

# నామినేషన్ల పర్వం జోరు..!

### మొదలైన పంచాయతీ ఎన్నికల వేడి అభ్యర్థుల వ్యూహాలు.. ఓట్లు రాబట్టే ఆలోచన లు

సంగారెడ్డి, డిసెంబర్ 02 (విజన్ ఆంధ్ర) : రెండవ విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయబోయే అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు.

వీడని లెక్కలు కులాలు, వర్గాలు, కుటుంబాల ఓట్ల గణాంకాలు

ప్రతి అభ్యర్థి తన గెలుపు అవకాశాలను లెక్కలేసుకుంటూ గ్రామంలోని కులాల వారీగా, వర్గాల వారీగా, కుటుంబాల వారీగా ఓట్ల గణాంకాలను పరిశీలిస్తున్నారు. ఓటుకు ఎంత ఇవ్వాలి? ఎవరిని ఒప్పించాలి? ఎలాంటి అంగీకారాలు ఇవ్వాలి? అనే గణితంలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ఎంత ఖర్చు చేస్తే గెలుస్తాం? ఎలాంటి హామీలు ఇస్తే ఓట్లు వస్తాయి? పాతకాలపు "చివరి రెండు రోజుల్లో డబ్బు – మద్యం పంచితే ఓట్లు వచ్చేస్తాయి" అనే పద్ధతులు కాలం చెల్లాయి. ఈసారి గ్రామస్తులు అభ్యర్థుల నుండి అభివృద్ధి హామీలు, గతంలో చేసిన సేవలు, భవిష్యత్తులో చేయగల పనులు గురించి క్లారిటీ కోరుతున్నారు. దీంతో అభ్యర్థులు ఖర్చులు, హామీలు, వ్యూహాలు అనేక కోణాల్లో ఆలోచిస్తూ ప్రచారానికి సిద్ధమవుతున్నారు.

జహీరాబాద్ మండల పరిధిలోని రాయిపల్లి (డి) గ్రామంలో గ్రామ పంచాయతీ త్రీవ పోటి నెల కొంది. బిఆర్ఎస్ పార్టీ బలపరచిన అభ్యర్థి గంగారం గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థి సంజీవరెడ్డి




మద్య గట్టి పోటి ఉంది.

త్వరలో గడపగడపకు ఓటు కోసం అభ్యర్థన

నామినేషన్ పర్వం ముగియగానే, అభ్యర్థులు రేపటి నుంచే గ్రామంలో ప్రతియ ఇంటికీ, ప్రతి ఓటరుకీ చేరి తమకు మద్దతు కోరనున్నారు. హెూటళ్ల దగ్గర, చౌరస్తాల్లో, ప్రత్యక్ష ప్రచారం వేడెక్కనుంది. ఎవరు ఏం హామీ ఇస్తారు? ఎవరి మాట ప్రజలకు నమ్మకం కలిగిస్తుంది? అనే పోటీ అభ్యర్థులను కొత్త పరీక్షకు గురి చేయనుంది. ఏది ఏమైనప్పటికీ బిఆర్ఎస్ పార్టీ బలపరచిన అభ్యర్థి గోవర్ధన్ రెడ్డి వైపు గ్రామస్థుల చూపు కనబడుతుంది.

ఎవరినీ అదృష్టం వరిస్తుంది?

గ్రామానికి పౌరుడు ఎవరో! సర్పంచ్ కిరీటం ఎవరినీ వరిస్తుందో 14 వ తేదీనే తేలనుంది. అందరి దృష్టి ఇప్పుడు అభ్యర్థుల ప్రచారం. ప్రజల స్పందన, చివరి నిమిషం లెక్కలపైనే నిలిచింది. గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది..! ఇక ఎవరినీ అదృష్టం వరిస్తుందో చూడాల్సిందే..?

## కాంగ్రెస్ శ్రేణులతో మంత్రి జూపల్లి సమావేశం

### కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు ఆఫీస్ లో కార్యక్రమం
### పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులు
### సీయం సభ విజయవంతంపై శ్రేణులకు దిశానిర్దేశం

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 01, (విజన్ ఆంధ్ర) తెలంగాణ ప్రజాప్రభుత్వ రెండేళ్ల ప్రజాపాలన విజయోత్సవ సభను విజయవంతం చేసేందుకు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపలి కృష్ణారావు అన్నారు.మంగళవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో ఆయన పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీయం ఆదిలాబాద్ పర్యటన కు సంబంధించి శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేసారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మద్దతు దారుల అభ్యర్దుల గెలుపుకు అంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లపూల నర్సయ్య, మాజీ




కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఆదిలాబాద్ ,బోథ్, ఆసిఫాబాద్, నిర్మల్ అసెంబ్లీ ఇంచార్జ్‌లు కంది శ్రీనివాస రెడ్డి , ఆడె గజేందర్, శ్యాంనాయక్ , శ్రీహరి రావు, ముదుపు దామోదర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, గోక గణేష్ రెడ్డి , బోరంచు శ్రీకాంత్ రెడ్డి,గంద్రత్ సుజాత, యువజన కాంగ్రెస్ నాయకులు , మహిళా విభాగం ,కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించండి.!

### భాజపా మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం.!!
### -పీ.డీ.ఎస్.యు ఆదిలాబాద్ జిల్లా ఇరవైవ మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శ్రీకాంత్ పిలుపు



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 01 , (విజన్ ఆంధ్ర) భారత దేశంలో భాజపా ఏకపక్షంగా తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని విద్యార్థులంతా వ్యతిరేకించాలని పీ.డీ.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వి.శ్రీకాంత్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కొమురం భీమ్ భవన్ లో పీ.డీ.ఎస్.యు ఆదిలాబాద్ జిల్లా ఇరవైవ మహాసభ నిర్వహించారు. దీనికి ముందు సంస్థాగత చిహ్నమైన బిగిపిడికిలి జెండాను జిల్లా అధ్యక్షుడు ఎర్రాజి హరీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభకు ముఖ్య అతిథిగా సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ... నరేంద్ర మోదీ హయంలో దేశ విద్య పూర్తిగా విధ్వంసం అయిపోతున్నదని ఆరోపించారు. విద్య ప్రమాణాలు, నాణ్యత కూడా లోపిస్తున్నాయని ఇది నష్టదాయకమైన చర్య అన్నారు. సమాజ అభివృద్ధికి విద్య ఎంతగానో తోడ్పడుతుందని అలాటి విద్యను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర,రాష్ట్ర బడ్జెట్లలలో విద్యకు అతితక్కువ నిధులను కేటాయిస్తున్నారని మరోవైపు ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను విపరీతంగా ప్రోత్సహించే చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠ్య పుస్తకాల నుండి చరిత్రను, సైన్స్ లను తొలగిస్తున్నారనీ, అశాస్త్రీయ పుక్కిటి పురాణ కథలను, వాస్తు జ్యోతిష్య శాస్త్రలను విద్యార్థుల పాఠ్య పుస్తకాలలోకి ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఇతర దేశాలు శాస్త్ర సాంకేతిక రంగాలలో దూసుకుపోతుంటే భారతదేశం మాత్రం స్వదేశీ జపం చేస్తూ విద్యను ప్రపంచ మార్కెట్ లో అమ్మకానికి పెట్టినట్లు, విదేశీ విశ్వ విద్యాలయాలను ఆహ్వానిస్తూ విద్యా వ్యాపారానికి పాల్పడుతుందని పేర్కొన్నారు. పాలక ప్రభుత్వాలు ఏకపక్షంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని, యూజీసీ నూతన నిబంధనలను తీసుకువచ్చిందనీ విద్యార్థులంతా వీటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.. ఇప్ప జిల్లా కార్యదర్శి వెంకట్ నారాయణ మాట్లాడుతూ పేద,ధనిక అసమానతలు లేకుండా దేశమంతా సమానమైన ,శాస్త్రీయమైన విద్యా విధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. దీని కొరకు పీ.డీ.ఎస్.యు గత యాభై ఏళ్ల కాలంగా ఉద్యమిస్తున్నదని , జార్జిరెడ్డి, జేసిఎస్ ప్రసాద్,శ్రీపాద శ్రీహరి,కోల శంకర్, రంగవల్లి, స్నేహలత, చేరాలు,సాంబయ్య,వరహాలు లాంటి అనేకమంది విద్యార్థులు విద్యార్థి ఉద్యమంలో అమరత్వం పొందారని వారి ఆశయ సాధనకు పీ.డీ.ఎస్.యు కృషి చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళావతి, పి.డి.ఎస్.యు రాష్ట్ర నాయకుడు వెంకటేష్, పీ.డీ.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ మరియు జిల్లా ఉపాధ్యక్షురాలు దీప లక్ష్మి,జిల్లా సహాయ కార్యదర్శి దత్తు, జిల్లా కోశాదికారి నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నకోడూరుమండలంలోనిక్లస్టర్ల లలో నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హైమావతి క్షేత్రస్థాయిలో తనిఖీ



సిద్దిపేట జిల్లా ప్రతినిధి విజన్ఆంధ్ర 02 డిసెంబర్: 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు – 2025 ప్రక్రియలో భాగంగా మంగళవారం చిన్నకోడూర్ మండలం రామంచ క్లస్టర్, నారాయణరావుపేట మండలం మల్యాల క్లస్టర్, సిద్ధిపేట రూరల్ మండలం పుల్లూరు, మచాపూర్ క్లస్టర్ లలో నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలోపరిశీలించారు.రామంచ క్లస్టర్ లో రామంచ, గంగాపూర్నారాయణరావుపేట మండలం మల్యాల క్లస్టర్ లో మల్యాల, గుర్లాగొంది, సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు క్లస్టర్ లో పుల్లూరు, పెద్ద లింగారెడ్డిపల్లి,బండచేర్లపల్లి రూరల్ మండల మచాపూర్ క్లస్టర్ లో మాచపూర్ చింతమడక, సీతారాంపల్లి గ్రామాల నామినేషన్ స్వీకరిస్తున్నట్లు అధికారులు కలెక్టర్ కి తెలిపారు.

ఈ రోజు ఆఖరు రోజు సాయంత్రం 5 వరకు ఎంతమంది నామినేషన్ అభ్యర్థులు ఉంటే వారిని మాత్రమేలోనికిఅనుమతించాలని 5 తరవాత వచ్చిన వారికిఅనుమతించకూడదని అర్ ఓ లకు తెలిపారు. సాయంత్రం 5 దాటిన మల్యాల మరియు మాచాపూర్ క్లస్టర్లోఎక్కువ మంది అభ్యర్థులు లైన్ లో నిరీక్షణచూసిఅధికారులపైన ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ వేయడానికి అభ్యర్థులు ఉండడం చూసి క్లస్టర్ లో రెండు కౌంటర్ లు పెట్టీ నామినేషన్ పత్రాలు తీసుకోవాలని అర్ ఓ, ఏ అర్ ఓ లను ఆదేశించారు. అన్ని నామినేషన్ పత్రాలు స్వీకరించి అన్నింటినీ టి– పోల్ లో అప్లోడ్ చేశాకే వెళ్లాలని తెలిపారు

## గంజాయి డాన్ కామాక్షమ్మకు చెక్

### ఆమె ఐదు ఇళ్లను నేలమట్టం చేసిన జనం

నెల్లూరు,డిసెంబర్ 2: నెల్లూరులో సీపీఎం నేత హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి మాఫియా లేడి డాన్ కామాక్షమ్మకు చెందిన ఐదు ఇళ్లను మంగళవారం స్థానికులు నేలమట్టం చేశారు. నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపుతూ.. కామాక్షమ్మ తమను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని ఈ సందర్భంగా స్థానికులు మండిపడ్డారు. తమ పిల్లలకు గంజాయి అలవాటు చేసి.. వారి జీవితాలతో చెలగాటం ఆడిందని వారు వాపోయారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై ఆమె అనుచరులు తీవ్రంగా దాడి చేయడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మతోపాటు ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.స్థానిక ఆర్డీటీ కాలనీలో కూల్చివేసిన ఇళ్లలో కామాక్షమ్మ తన తల్లి సోదరులతో నివాసం ఉంటుంది. ఈ కాలనీలోని నివాసాలను కేంద్రంగా చేసుకుని ఆమె పలు అరాచకాలకు పాల్పడిందని స్థానికులు వివరించారు. సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితులంతా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులేనని స్థానికులు వివరిస్తు న్నారు. కొన్ని ఏళ్లుగా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులు ఇక్కడే ఉం టూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా వీరంతా.. యువతకు గంజాయి అలవాటు చేసి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారని పేర్కొన్నారు.

## హుస్నాబాద్ ప్రాంతానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి




హుస్నాబాద్ విజన్ ఆంధ్ర డిసెంబర్ 2 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటిన ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి ఇంతవరకు నెరవేర్చరని ఆరోపించారు.ముఖ్యమంత్రి హుస్నాబాద్ కు వస్తున్న సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.మొన్నటి తుఫాన్ వర్షాలతో నష్టపోయిన పంట రైతులకు ఇంతవరకు సర్వే చేయలేదని నష్టంపరిహారం అందించలేదన్నారు.కళ్యాణ లక్ష్మీ పథకంలో తులం బంగారం ఇస్తామని ఎగ్గొట్టారని,విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని ఇవ్వలేదని వికలాంగుల వృద్ధాప్య వితంతు పింఛన్లు పెంచుతామని మోసం చేశారని అన్నారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్ అని,ఐదువందల రూపాయలకే గ్యాస్ అని కొందరికి వర్తింప చేశారన్నారు.మహిళలకు నెలకు ఇరవై ఐదు వందలు ఇస్తామని మోసం చేసారన్నారు.మహిళా సంఘాలకు మాత్రమే చీరలు పంపిణీ చేశారు కానీ తెలంగాణలో నివసిస్తున్న అందరు మహిళలకు చీరలు పంపిణీ చేయాలని మరియు ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటిన తర్వాత ఒక్కసారి మాత్రమే ఇచ్చారని ఇంకా మూడు చీరలు బాకీ పడ్డారని అన్నారు.ఎన్నికలప్పుడు ప్రియాంక గాంధీని తీసుకువచ్చి మెడికల్ కాలేజీ ఇస్తామన్నారు.ఆ హామీ అమలు చేయాలన్నారు. నూతన ఆసుపత్రి పేరుతో హుస్నాబాద్ లో కొద్ది సంవత్సరాల క్రితమే నిర్మించిన ఆసుపత్రిని కేవలం కమిషన్ల కోసమే ఇలాంటి అనుమతులు లేకుండా కూల్చివేశారని ఆరోపించారు. గత బిఆర్ఎస్ హయాంలో 24 గంటల కరెంటు అందించామని కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందోనని రైతులు అయోమయ స్థితిలో ఉన్నారని అన్నారు. రైతులకు యూరియా కొరకు లైన్లలో నిలుచుండే పరిస్థితి ఏర్పడిందని ఇప్పటికైనా రైతులకు యురియా సక్రమంగా సరఫరా చేయాలని కోరారు.ఎప్పుడో చాలా ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్లు కొత్తది నిర్మించ కుండా రెండు కోట్లతో రిపేరు చేయించారని అది కూలిపోయే దశలో ఉన్నదని అన్నారు.ఇప్పటికైనా ముఖ్యమంత్రి హుస్నాబాద్ కి ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.ఈ సమావేశంలో టిఆర్ఎస్ పట్టణ గ్రామీణ అధ్యక్షులు ఎండి అన్వర్ గంగం మదన్మోహన్ రెడ్డి,మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి,నాయకులు కవ్వ వెంకటరామిరెడ్డి,అలుమల్ల ప్రభాకర్ రెడ్డి, మడప ప్రభాకర్ రేడ్డి, వెంకటేష్,మహేష్ పాల్గొన్నారు.

# జనరల్ సీటులో ఎస్సీ అభ్యర్థుల జోరు

**- తల్లారంలో ఎన్నికల వేడి**
**- తల్లారంలో సర్పంచ్ హెూరాహెూరి**
**చదువున్న నాయకురాలిపై గ్రామస్తుల విశ్వాసం**
**- ఓటమి నుంచి పోరాటానికి లక్ష్మీప్రసన్న శేఖర్ మరోసారి సర్పంచ్ బరిలో**





చేవెళ్ల,డిసెంబర్ 02 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల మండలంలోని తల్లారం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి ఈసారి జనరల్‌గా ప్రకటించబడినప్పటికీ రాజకీయ సమీకరణాలు ఊహించని విధంగా మారాయి. సాధారణంగా జనరల్ కేటగిరీలో అగ్రవర్గాల నుంచి అభ్యర్థులు బరిలోకి దిగడం సాధారణం. అయితే తల్లారంలో ఈసారి పరిస్థితి పూర్తి భిన్నంగా వుండటం రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఎస్సీ వర్గానికి చెందిన నాయకులు ముందుండి నామినేషన్లు దాఖలు చేయడం గ్రామ రాజకీయాలను పూర్తిగా కొత్త దిశలో నడిపిస్తోంది. 2018లో సర్పంచ్ పదవికి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందిన కావాలి లక్ష్మీప్రసన్న శేఖర్ ఈసారి మరింత శక్తివంతంగా మళ్లీ బరిలోకి దిగారు. గత ఓటమిని పాఠంగా తీసుకొని ప్రజల్లో తిరిగి చురుకైన ప్రచారాన్ని సాగిస్తూ.. గ్రామాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. చదువుకున్న నాయకురాలిగా గ్రామ యువతలో, పెద్దల్లో ఆమెకు మంచి గుర్తింపు ఉండటం ప్రజలతో సత్సంబంధాలు కలిగి పనిచేయడం ఆమెకు ప్రధాన బలంగా మారినట్లు కనిపిస్తోంది. చదువున్న నేత ముందుకు వస్తే గ్రామ అభివృద్ధి దిశ తేలిపోతుందని. గతంలో స్వల్ప తేడాతో ఓడినా వారి ధైర్యం పట్టుదల కోల్పోలేదని, ఈసారి గెలిచి గ్రామానికి సేవ చేయగలరనే నమ్మకం మాలో ఉందని గ్రామస్తులు నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. యువత కూడా లక్ష్మీ ప్రసన్న శేఖర్ అభ్యర్థిత్వాన్ని సానుకూలంగా స్వాగతిస్తూ.. చదువు ఉంటే మార్పులు తీసుకురాగలరని అభివృద్ధి సాధ్యమని నిరూపిస్తారు అని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి కట్టుబడి తన వైఫల్యాన్ని విజయంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్న అభ్యర్థిగా లక్ష్మీప్రసన్న శేఖర్ పేరు గ్రామంలో వేగంగా వినిపిస్తోంది. జనరల్ రిజర్వేషన్ ఉన్న స్థానంలో ఎస్సీ నేతల ముందంజ గ్రామ రాజకీయాల్లో కొత్త పరిణామంగా మారింది. తల్లారం సర్పంచ్ ఎన్నిక చేవెళ్ల పరిధిలో ప్రస్తుతం అత్యంత చర్చనీయాంశంగా నిలుస్తోంది.

# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం, సోదరుడి హత్య

**రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించేందుకు యత్నం.**
**నర్సయ్య పోలీసులకు ఫిర్యాదుతో కేసును చేదించిన పోలీసులు.**
**ముగ్గురు నిందితుల అరెస్ట్.**
**కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం.**




ఉమ్మడి కరీంనగర్ బ్యూరో డిసెంబర్ 02 (విజన్ ఆంధ్ర): ఆర్థిక ఇబ్బందుల ఊబిలో కూరుకుపోయిన ఓ వ్యక్తి, ఏకంగా తన అన్ననే అత్యంత కిరాతకంగా హత్య చేసి, దాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి, పెద్ద మొత్తంలో ఇన్సూరెన్స్ డబ్బులు కొట్టేయాలని పన్నిన కుట్రను కరీంనగర్ జిల్లా పోలీసులు ఛేదించారు. మంగళవారం కరీంనగర్ కమిషనరేట్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించిన కరీంనగర్ సిపి గౌస్ అలాం. ఈ సందర్భంగా కరీంనగర్ సిపి మాట్లాడుతూ.... రామడుగు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసులో, ప్రధాన నిందితుడితో సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రామడుగు గ్రామానికి చెందిన మామిడి నరేష్ (30) వ్యాపారాల్లో, ముఖ్యంగా షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి సుమారు రూ. 25 లక్షలు నష్టపోయాడు. టిప్పర్ వాహనాల ఈఎంఐ, లు సహా మొత్తంగా రూ. 1.50 కోట్ల అప్పుల్లో చిక్కుకున్నాడు. ఈ అప్పుల నుంచి బయటపడేందుకు నరేష్ దుర్మార్గమైన ప్లాన్ చేశాడు. నరేష్ తన అన్న, మానసిక పరిపక్వత లేని మామిడి వెంకటేష్ (37) పేరుపై ఏకంగా రూ. 4 కోట్ల 14 లక్షల విలువైన పలు ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నాడు. ఇందులో ఐసీఐసీఐ, ఆదిత్య బిర్లా, టాటా ఏఐజీ, ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ వంటి సంస్థల నుంచి ఒక్కొక్కటి కోటికి పైగా విలువైన పాలసీలు ఉన్నాయి. దీంతో పాటు, అన్న పేరుపై రూ. 20 లక్షల గోల్డ్ లోన్ కూడా తీసుకున్నాడు. వెంకటేష్ చనిపోతే ఇన్సూరెన్స్ డబ్బులు వస్తాయి, లోన్ మాఫీ అవుతుంది అనే దురుద్దేశంతో ఈ ఘాతుకానికి తెగబడ్డాడు. అని తెలిపారు. ఈ కుట్రలో తన స్నేహితుడు నముండ్ల రాకేశ్ (సహాయం చేసిన వ్యక్తి), టిప్పర్ డ్రైవర్ మునిగాల ప్రదీప్‌ను భాగం చేశాడు. ఈ ప్లాన్‌కు సంబంధించిన చర్చల వీడియోను రాకేశ్ తన ఫోన్‌లో భద్రపరిచాడు. తేదీ 29-11-2025 రాత్రి, ప్లాన్ ప్రకారం... : డ్రైవర్ ప్రదీప్ టిప్పర్ (టీ ఎస్ -02-%ఖణ%-6261)ను మట్టి లోడ్‌తో రామడుగు శివారులోని భారత్ పెట్రోల్ పంప్ వద్దకు తీసుకొచ్చాడు. అనుకున్నట్లుగా, బ్రేక్ డౌన్ అయినట్లు నటించి, నరేష్‌కు ఫోన్ చేశాడు. నరేష్ తన అల్లుడు సాయి ద్వారా వెంకటేష్‌ను జాకీ ఇచ్చి టిప్పర్ వద్దకు "జాకీ పెట్టాలి" అనే సాకుతో పంపాడు. నరేష్ అక్కడికి చేరుకున్నాక, టిప్పర్ స్టార్ట్ చేసి ఉంచి, జాకీని టైర్ కింద పెట్టి తిప్పమని తన అన్న వెంకటేష్‌కు చెప్పాడు. వెంకటేష్ సెల్ ఫోన్ లైట్ పెట్టుకొని జాకీ తిప్పుతుండగా, నరేష్ స్వయంగా టిప్పర్‌ను నడిపి, జాకీ తిప్పుతున్న అన్న వెంకటేష్ పైకి ఎక్కించాడు. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మరణించాడు.డ్రైవర్ ప్రదీప్‌ను పారిపోవాలని చెప్పి, నరేష్ దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అని అన్నారు.


అల్లుడి సాక్ష్యంతో ఛేదన : వెంకటేష్ మృతిపై నరేష్ కుటుంబ సభ్యులకు, పోలీసులకు డ్రైవర్ యాక్సిడెంట్ చేశాడని చెప్పగా, నరేష్ అల్లుడు సాయి... టిప్పర్‌ను నడిపింది నరేషే అని తన తండ్రి మామిడి నర్సయ్యకు చెప్పాడు. ఆయన అన్నారు. దీంతో నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేశారు. అని తెలిపారు. మృతదేహ పంచనామా, స్థల పరిశీలన, సాక్ష్యాల సేకరణ అనంతరం, ప్రమాద ఘటనపై అనుమానాలు కలగడంతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. మంగళవారం (02-12-2025) ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాన్ని అంగీకరించారు. అని సిపి వెల్లడించారు.

నిందితుల నుంచి హత్య కుట్ర వీడియో ఉన్న మొబైల్ ఫోన్, ఇన్సూరెన్స్ పాలసీలు, బ్యాంకు పాస్ బుక్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఏ.సి.పి విజయ కుమార్ ఆధ్వర్యంలో, ఇన్స్ పెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్.ఐ. రాజు మరియు సిబ్బంది ఈ కేసును ఛేదించడంలో కృషి చేశారు. కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అభినందించారు. నిందితులపై సంబంధిత సెక్షన్లలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. మరిన్ని సాంకేతిక ఆధారాల కోసం దర్యాప్తు కొనసాగుతోందని కరీంనగర్ సిపి వెల్లడించారు.

# ఆదిలాబాద్ పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ డైవర్షన్ - వన్ టౌన్ సిఐ బి సునీల్ కుమార్

**డిసెంబర్ 4వ తారీఖున అమలులో ఉండనున్న ట్రాఫిక్ నిబంధనలు.**
**అంకోలి,తంతోలి గ్రామ ప్రజలకు కె ఆర్ కె కాలనీ మీదుగా, పిట్టల వాడ గుండా పట్టణానికి చేరుకోవాలి**
**ఏరోడ్రం నుంచి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు రోడ్డుపై పూర్తిగా ఉండనున్న ఆంక్షలు**
**నిర్మల్, మావల మీదుగా సభకు వచ్చే బస్సులు పిట్టలవాడ, మావల పోలీస్ స్టేషన్ మీదుగా తెలంగాణ రెసిడెన్షియల్ బాయ్స్ జూనియర్ కళాశాలలో పార్కింగ్ చేయాలి.**
**మీటింగ్ సందర్భంగా వచ్చిన ప్రజలు నిర్దేశించిన ప్రదేశాలలోనే పార్కింగ్ చేయాలి**
**పార్కింగ్ చేసిన తర్వాత పట్టణ అంతర్గత రోడ్ల ద్వారా స్టేడియం ద్వారానికి ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ మీదుగా నడక మార్గం ద్వారా చేరుకోవాలి**




ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 01 , (విజన్ ఆంధ్ర) డిసెంబర్ 4వ తారీఖున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ పట్టణ పర్యటన సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో పలు ట్రాఫిక్ డైవర్షన్లు ఉండనున్నట్లు వన్ టౌన్ సిఐ బి సునీల్ కుమార్ తెలియజేశారు. ట్రాఫిక్ ఆంక్షలు డిసెంబర్ 4వ తారీఖు ఉదయం నుండి అమలులో ఉండనున్నట్లు తెలిపారు. అంకోలి, తంతోలి వైపు నుండి వస్తున్న గ్రామ ప్రజలు పట్టణంలోని కేఆర్కే కాలనీ మీదుగా, మావల పోలీస్ స్టేషన్ మీదుగా తిరుమల పెట్రోల్ బంక్ మీదుగా పట్టణానికి చేరుకోవాలని, ఆర్ఆర్ కాలనీ, హ్యాండీక్యాప్డ్ కాలనీ ప్రజలకు అదే నియమాలు వర్తిస్తాయని తెలిపారు. స్థానిక ఏరోడ్రం వద్ద నుండి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, కలెక్టర్ చౌరస్తా వరకు సాధారణ ప్రజలకు అనుమతులు ఉండవని, ప్రజలు నిత్యవసర అవసరాలకు పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని తెలిపారు. విఐపి వాహనాలు విఐపి వాహనాలు ఎన్టీఆర్ చోటు మీదుగా కాన్వెంట్ స్కూల్ ముందు నుండి శ్రీ సరస్వతి శిశు మందిర్, టిటిడి కళ్యాణ మండపానికి చేరుకోవాలి.

సభాస్థలికి వచ్చే ప్రజలకు పార్కింగ్ ప్రదేశాలు

టు వీలర్ ప్రజలకు స్థానిక రామ్ లీలా మైదానం, సైన్స్ డిగ్రీ కళాశాల. ఆటోలకు మరియు కార్లకు పట్టణంలోని డైట్ కళాశాల మైదానం. వీఐపీలు, వీఐపీలు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ మరియు టిటిడి కళ్యాణమండపం వినియోగించుకోవాలని తెలిపారు. నిర్మల్ నుండి వచ్చే బస్సులు, భారీ వాహనాలకు పిట్టల వాడ, మావల పోలీస్ స్టేషన్ మీదుగా తెలంగాణ రెసిడెన్షియల్ బాయ్స్ జూనియర్ కళాశాల లో పార్కింగ్. టు వీలర్లు, కార్లు, ఆటోలు తమకు కేటాయించిన పార్కింగ్ స్థలాలలో పార్కింగ్ చేసిన తర్వాత నడక మార్గంలో ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ దారిలో మీటింగ్ ప్రదేశానికి చేరుకోవాలి. ప్రజలు తమ వాహనాలను పార్కింగ్ ప్రదేశాలలో నిలిపి నడుచుకుంటూ అంతర్గత రోడ్ల ద్వారా సభాస్థలికి రావాలని తెలిపారు. నిర్దేశిత ప్రాంతాలలో తప్ప వేరే రూట్లలో, రోడ్డుపై పార్కింగ్ చేయరాదు. స్థానిక కలెక్టర్ చౌరస్తా నుండి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం మరియు ఏరోడ్రం వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నట్లు ప్రజలు సహకరించాలని తెలిపారు.

# మూగ బాలుడిపై వీధికుక్కల దాడి

## తీవ్ర గాయాలతో నీలోఫర్‌కు తరలింపు

హైదరాబాద్,డిసెంబర్ 2 : హైదరాబాద్‌లోని హయత్‌నగర్ శివగంగ కాలనీలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఏడేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. సుమారు 10 నుంచి 20 కుక్కలు ఎగబడటంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. శునకాల దాడిలో అతని చెవి ఊడిపోవడంతోపాటు తల, నడుము, వీపు భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతిరావు, చంద్రకళ దంపతులు గత మూడేండ్లుగా శివగంగ కాలనీలో కిరాయికి ఉంటున్నారు. వారి కుమారుడు ప్రేమ్‌చంద్ పుట్టుకతో మూగవాడు. మంగళవారం ఉదయం తండ్రి మేస్త్రీ పనికి వెళ్లగా, తల్లి ఇంట్లో నీళ్లు పడుతున్నది. ఈ క్రమంలో ఇంటి బయట ఆడుకుంటున్న ప్రేమ్ చంద్‌పై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు వాటిని తరిమేసి బాలుడిని రక్షించారు. అనంతరం అతడిని నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి నిలోఫర్‌కు పంపడంతో అత్యవసర వార్డులో చికిత్స అందిస్తున్నారు. కాగా, నగరంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేస్తున్నాయని, జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల విస్తృత ఫ్లాగ్ మార్చ్

## స్థానిక సంస్థల పోలింగ్ పై ప్రజల్లో నమ్మకం పెంచుతున్న పోలీసులు



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో డిసెంబర్ 2 (విజన్ ఆంధ్ర): సమస్యాత్మక గ్రామాలలో మంగళవారం డిఎస్పి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విస్తృతంగా ఫ్లాగ్ మార్చ్ ను పోలీసులు నిర్వహించారు.ఎన్నికల భద్రత దృష్ట్యా గాజులపేట, జమిస్తాపూర్, ధర్మాపూర్ గ్రామాల్లో డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు నిఘా బలోపేతం చేశారు.జిల్లా ఎస్పీ డి.జానకి, ఆదేశాల మేరకు, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన గాజులపేట, జమిస్తాపూర్, ధర్మాపూర్ గ్రామాల్లో విస్తృతంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గ్రామాల ప్రధాన వీధులు, సున్నిత ప్రాంతాలు, కూడళ్లు, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజల్లో నమ్మకం, భద్రతా భావాన్ని కల్పించారు.ఫ్లాగ్ మార్చ్ ముఖ్య విషయాలు పోలీసు వాహనాలు, ప్రత్యేక పార్టీ సిబ్బంది, రూరల్ పోలీసు బలగాలతో భారీ ఫ్లాగ్ మార్చ్. సమస్యాత్మకంగా గుర్తించిన హాట్‌స్పాట్ ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు.

పోలింగ్ కేంద్రాల చుట్టూ పర్యవేక్షణ & రాత్రి బీట్ పట్రోలింగ్ బలోపేతం. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు భద్రత, ఓటు హక్కు వినియోగం పై అవగాహన. ఎన్నికలలో డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాల పంపిణీపై నిఘా పెంచినట్లు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా బాధ్యతగా ఓటేయాలని,సమస్యలు, బెదిరింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే 100 నంబర్, లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చట్ట ఉల్లంఘనలు ఏవైనా జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫ్లాగ్ మార్చ్ సందర్భంగా కూడళ్లు, ప్రధాన రహదారులు వెంట ప్రజలకు ఎన్నికల నిబంధనలు, శాంతి భద్రత చర్యలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్, ఎస్ఐ విజయ్ కుమార్, స్పెషల్ పార్టీ సిబ్బంది మరియు రూరల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వికాస్ హై స్కూల్ చిన్నారులు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన ర్యాలీ



కరీంనగర్ డిసెంబర్ 02: ప్లాస్టిక్ వినియోగంపై చిన్నారులు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శారదాదేవి మార్గదర్శకంలో ఉపాధ్యాయుల సహకారంతో యూకేజి, ఎల్కేజి తరగతుల విద్యార్థులు స్థానిక మార్కెట్ లో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే హానులను ప్రజలకు వివరించి, అవగాహన కల్పించారు. చిన్న పిల్లలు ఉత్సాహంగా పాల్గొని, ప్రజలకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, పర్యావరణాన్ని కాపాడు కోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఈ తరహా కార్యనిర్వహణలు చిన్న వయస్సులోనే పిల్లలకు పర్యావరణం పై బాధ్యత గురించి తెలియజేస్తూ, సమాజంలో స్వచ్ఛత్వం, ప్లాస్టిక్ రహిత జీవనశైలిని ప్రోత్సహించడం లో కీలకంగా మారింది. శారదదేవి అన్నారు.

## జగిత్యాల జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




జగిత్యాల డిసెంబర్ 02 : జగిత్యాల జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల పాటు డిసెంబర్ 1వ తేది నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మంగళవారం తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమా వేశాలు నిర్వహించరదాని, నిబంధనకు విరుద్ధిదంగా డి.జే వినియో గించారాదని ఎస్పీ తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. పోలీస్ యాక్ట్ విషయంలో పోలీసులకు జిల్లా ప్రజలు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

## బాల్య వివాహల నిర్మూలనకు అందరి సహకారం ఉండాలి



పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ న్యూ బెలివెర్ చర్చిలో బాల్య వివాహాలను అరికట్టడంలో అందరి సహకారం ఉండాలని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సమన్వయకర్త డా. దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ జె. సుచరిత అన్నారు. మంగళవారం బాల్య వివాహాలు,విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారానే భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించవచ్చునని వారు అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన అనే అంశం పై అవగాహన కల్పించారు. లింగ వివక్షత, బాలల హక్కులు, ఉన్నత విద్య, ఫోక్సో చట్టం, సఖి సేవలు, టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181, 112, 14567, 155326 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ డేనియల్, కృపరావు, ప్రభాకర్ రావు, నీలం, రాజు తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకున్న సంజీవ్ మదిరాజ్



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో డిసెంబర్ 2 (విజన్ ఆంధ్ర) మహబూబ్ నగర్ జిల్లా డిసిసి అధ్యక్షునిగా నియామక పత్రాన్ని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నట్రాజన్ సంజీవ్ ముదిరాజ్ కు పత్రాన్ని అందించారు. మంగళవారం గాంధీభవన్ లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జీ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ చేతులమీదుగా సంజీవ్ ముదిరాజ్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సంజీవ్ ముదిరాజ్ రాష్ట్ర వివరాలు ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మాయి మహేష్ కుమార్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం అవగాహన కార్యక్రమం




మహబూబ్‌నగర్, ఉమ్మడి జిల్లా బ్యూరో డిసెంబర్ 2(విజన్ ఆంధ్ర) జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ గవర్నమెంట్ మహిళా డిగ్రీ కళాశాల (ఆటానమస్), మహబూబ్‌నగర్ లో బోటనీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారుకళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ బోటనీ విభాగాధిపతి ఆమినా ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ భోపాల్ గ్యాస్ విషాదాన్ని స్మరించుకుంటూ కాలుష్య నియంత్రణ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ విద్యార్థి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రమాదకరమైన కాలుష్య ప్రభావాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు బోటనీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు కాలుష్య నివారణపై నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ అనురాధ, ఐ. క్యూ. ఏసి సమన్వయకర్త డాక్టర్. శ్రీదేవి,అధ్యాపకులు డాక్టర్ కె. సుధీర్, డాక్టర్ కె. స్వేత, ఎస్. త్రివేణి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## జ్ఞానామృతం భగవద్గీత

ఖమ్మం బ్యూరో , డిసెంబర్ 2 (విజన్ ఆంధ్ర)శ్రీ మహావిష్ణువు దశవతారాలలో పరిపూర్ణవతార స్వరూపుడైన శ్రీకృష్ణ పరమాత్మ ప్రసాదించిన జ్ఞానామృతమే భగవద్గీత అని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి. సూర్యనారాయణ పేర్కొన్నారు. మార్గశిర శుద్ధ ఏకాదశి నాడు కురుక్షేత్ర సంగ్రామం లో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించిన భగవద్గీత మానవాళికి గొప్ప వరం అని, ఆ రోజున గీతాజయంతి జరుపుకుంటామని సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణవతార విశిష్టతను, భగవద్గీత ప్రాధాన్యత ను ఆయన వివరించారు. జగద్గురువైన శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించిన భగవద్గీత సర్వమానవాళికి వర్తిస్తుందని స్పష్టం చేశారు. విష్ణుమూర్తి కృష్ణవతారం దాల్చి పరమాత్మ స్వరూపాన్ని సామాన్యుడికిసైతం అర్ధం అయ్యే పరిస్థితులు కల్పించారని శ్రీకృష్ణ పరమాత్మ చిన్నతనంనుండే తానే భగవంతుడినని, ధర్మబోధనకు ఈ అవతారం లో వచ్చానని చెప్పారన్నారు. కర్షతి చిత్తం ఇతి కృష్ణ : అందరి మనసుల్ని ఆకర్షించేవాడు అనేది ' కృష్ణ ' శబ్దానికి నిర్వచనమని అన్నారు. భగవద్గీత లో 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు ఉన్నాయని, మానవజీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం అందించే శాస్త్రమని తెలిపారు. గొప్ప ఆధ్యాత్మిక గ్రంధమైన గీత లో జ్ఞాన, కర్మ, ధర్మ, భక్తి, యోగ సాధనములు తెల్పబడినవని, వీటిలో ఏ సాధన చేపట్టినా శ్రేయస్సు కలుగునని స్పష్టం చేశారు. సత్యధర్మాల సారాంశాన్ని తెలుపుటలో భగవద్గీతకంటే ఉన్నత ప్రామాణిక గ్రంధం ఈ సృష్టిలో లేదని ఆయన అభిప్రాయపడ్డారు. జగద్గురువైన శ్రీకృష్ణపరమాత్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని భక్తిశ్రద్ధలతో, నిర్మలచిత్తం తో ప్రార్థిద్దాం.

## సమస్యలను పరిష్కరించడమే ప్రథమ లక్ష్యం

**అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాను**

**ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి**

**ప్రతి కుటుంబానికి అండగా ఉంటాను**

**పీరంపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి బావనోల్ల గురువారెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 02 (విజన్ ఆంధ్ర) : గ్రామం అభివృద్ధి చెందడానికి అహర్నిశలు కృషి చేస్తానని పీరంపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి బావనోల్ల గురువారెడ్డి అన్నారు. గ్రామ ప్రజలతో ఎల్లప్పుడు అవినాభావ సంబంధం కలిగి ఉంటానని స్పష్టం చేశారు. మంగళవారం వికారాబాద్ మండల పరిధిలోని పీరంపల్లి గ్రామానికి చెందిన బావనోల్ల గురువారెడ్డి సిద్దులూరు క్లస్టర్లో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ అనునిత్యం ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి తోడ్పడుతానని తెలిపారు. పార్టీలకు అతీతంగా సహాయం కోరి వచ్చిన కుటుంబ సభ్యులకు నా శాయశక్తులా సహాయ సహకారం అందజేస్తానని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలకు ఏ ఇబ్బంది ఎదురైనా నా దృష్టికి తెచ్చినట్లయితే వెంటనే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. కుటుంబంలో నన్ను ఒకరిగా భావించేటట్లు మసలుకుంటానని విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామంలోని సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని భీమా వ్యక్తం చేశారు. నామినేషన్ వేసిన వారిలో సాయి నందన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ మంత్రులు స్పృహలో లేరు.. జగదీశ్ రెడ్డి ఫైర్

కోనసీమకు తెలంగాణ దిష్టి తగిలిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పది రోజుల తర్వాత స్పందించిన మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మంత్రులు స్పృహలో లేరని విమర్శించారు. కొందరు వాటర్‌లో నీళ్లు కలుపుకుని స్పృహ కోల్పోతున్నారని ఎద్దేవా చేశారు. మరికొందరు కమిషన్లు పంచుకునే పనిలో బిజీగా ఉన్నారని అన్నారు.పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పది రోజులకు స్పందించడం హాస్యాస్పదమని జగదీశ్ రెడ్డి అన్నారు. ఒక ప్రాంతం, ఒక మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడితే వాటిని ఉపసంహరించుకోవాలని సూచించారు. ఉద్యమ సమయంలో తామెప్పుడూ ప్రాంతాలను దూషించలేదని తెలిపారు.

## టీబీ నియంత్రణ కు స్క్రీనింగ్ పరీక్షలు ఎక్కువ గా నిర్వహించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో పట్టణ ఆరోగ్య కేంద్రాలు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం**




హనుమకొండ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 (విజన్ ఆంధ్ర) టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పట్టణ పరిధిలోని బోడగుట్ట, సోమిడి వడ్డేపల్లి, లష్కర్ సింగారం, పెద్దమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హసన్ పర్తి, కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1,98,000 ప్రభావిత గ్రూపులకు చెందిన వారిని పరీక్షించి అవసరమైన పరీక్షలు నిర్వహించవలసి ఉండగా1,30,049 మందికి స్క్రీనింగ్ నిర్వహించడం జరిగింది. స్క్రీనింగ్ తక్కువగా నిర్వహించిన వడ్డేపల్లి, లష్కర్ సింగారం , కడిపికొండ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను ఇందుకు గల కారణాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ దేశంలో టీబీ నిర్మూలన లక్ష్యంగా ఈ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోటీబీ నియంత్రణ కార్యక్రమాలకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని దానికి అనుగుణంగా స్క్రీనింగ్, ఎక్స్ రే, నాట్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన మొబైల్ ఎక్స్ రే మిషన్ ను పరిశీలించి ప్రణాళిక ప్రకారం ఎక్కడైతే ఎక్స్ రే పరీక్షలు తక్కువగా నిర్వహించారో అక్కడి ప్రజలకు అవగాహన కల్పించి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్క్రీనింగ్ బాగానే చేస్తున్నప్పటికీ పట్టణ పరిధిలో మాత్రం చాలా తక్కువగా ఉందని అన్నారు. పట్టణ ప్రాంతాలలో కూడా స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బంది, వనరులతో టిబి ముక్త్ భారత్ ,ఎన్సిడి, మాతా శిశు సంక్షేమంతో పాటు ఇతర అన్ని ఆరోగ్య కార్యక్రమాలు లక్ష్యాలను సాధించాలని, లేనట్లయితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య టీబీ ముక్త్ భారత్, గర్భిణీ స్త్రీల నమోదు , ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉన్న ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు, ఆశాలవారీగా సమీక్షించి కారణాలను తెలుసుకొని వాటిని అధిగమించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. 100 శాతం ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరగడానికి ప్రోత్సహించిన ఆరుగురు ఆశాలను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, పీవోడిటి డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డెమో వి అశోక్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## భగవంతుని కృప ప్రతిఒక్కరికి పై ఉండాలి



సూర్యాపేట డిసెంబర్ 02:(విజన్ ఆంధ్ర)ఆంజనేయస్వామి కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆంజనేయస్వామి మాలాధార స్వాములు ఆంగోతు అనిల్ కుమార్, ధరావత్ సురేష్ స్వామి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కుడకుడ ఆంజనేయస్వామి దేవాలయం నుండి మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవాలయానికి బయలుదేరి ఇరుముడి మహోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. 41 రోజులపాటు స్వామివారిని భక్తి, శ్రద్ధలతో పూజించి స్వామివారికి ఇరుముడి అందజేయడం ఆనందంగా ఉందన్నారు. 12 సంవత్సరాలుగా 20ముందుకి పై గా ఆంజనేయస్వామి మాల వేసుకుని పూజించి ఇరుముడితో మద్దిమడుగు వెళ్తున్నామన్నారు. ఆంగోతు తండా ఐలాపురం గ్రామ పంచాయతీ పరిధిలో హనుమాన్ దేవాలయం ప్రారంభించగా మధ్యలో ఆగిపోయింది దాని వలన మా గ్రామంలో చేసుకోవలసిన ఇరుముడి కార్యక్రమం ఇక్కడ చేసుకున్నామని తెలిపారు. ఈ సంవత్సరం కూడా హనుమాన్ దేవాలయం నుండి ఇరుముడి తో వెళ్తున్నామని తెలిపారు.దాతలు సహకరించి దేవాలయాల్ని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంగోత్ శ్రీకాంత్,సురేష్, బాలు, సుధాకర్, ప్రశాంత్, హరి సింగ్, దీపక్, శంకర్ పాల్గొన్నారు.

## ఖమ్మం అభివృద్ధికి కేంద్ర నిధులే ఆధారం



ఖమ్మం డిసెంబరు 02.(విజన్ ఆంధ్రా) రాష్ట్రం జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు, పథకాల ద్వారానే జరుగుతోందని బీజేపీ ఖమ్మం జిల్లా ఇంచార్జ్ బద్దం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మోదీ సంక్షేమ పథకాలను చూసే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని, సుమారు 75 గ్రామాలు కేంద్రం సహాయంతోనే అభివృద్ధి చెందాయని అన్నారు. మంగళవారం నాడు జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వర అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులను కేటాయించినప్పటికీ, వారి పదవులను నిలుపుకోవడానికి, గ్రూప్ రాజకీయాలను కట్టడి చేయడానికి తప్ప, ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఇచ్చిన నిధులు శూన్యం అని నాయకులు తీవ్రంగా విమర్శించారు. చివరగా, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సోదరులను రిజర్వేషన్ల విషయంలో మోసం చేసిందని బీజేపీ ఆరోపించింది. రాష్ట్ర స్థాయిలో 42% రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి, దానిని నిలబెట్టుకోలేని స్థితిలో ఉందని, అందుకే ఎన్నికలు పెట్టడానికి భయపడిందని అన్నారు. ఖమ్మం జిల్లాలో బీసీలకు కేవలం 11.9% రిజర్వేషన్ మాత్రమే కల్పించిందని, ఇది అధికారిక లెక్కల ప్రకారం బీసీలను ఎంతగా మోసం చేశారో తెలియజేస్తోందని విమర్శించారు. చట్టబద్ధంగా ఇవ్వాల్సిన రిజర్వేషన్లను కూడా ఇవ్వకపోగా, కనీసం జనరల్ స్థానాల్లోనూ బీసీ సోదరులకు అవకాశం ఇవ్వకుండా అణగదొక్కుతున్నారని బీజేపీ నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు ఖమ్మం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ బలవంతపు ఏకగ్రీవాలకు ప్రయత్నించడం, ప్రత్యర్థులను బెదిరించడం వంటి అప్రజాస్వామిక పద్ధతులు అవలంబిస్తోందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఏకగ్రీవాల కోసం డబ్బు ఇవ్వడం లేదా ప్రత్యర్థులను బెదిరించడం వంటి చర్యలకు కాంగ్రెస్ నాయకులు పాల్పడుతున్నారని, అభ్యర్థులు లొంగకపోతే వారి కుటుంబ సభ్యులను కూడా వేధిస్తున్నారనే ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో పడటానికి లేదా తాము మంత్రులమని నిరూపించుకోవడానికి కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరి బెదిరింపులకూ, ఒత్తిళ్ళకూ భయపడాల్సిన అవసరం లేదని భారతీయ జనతా పార్టీ తరఫున నాయకులు భరోసా ఇచ్చారు.

## మాల్యాల్ గ్రామంలో జాతీయ మానసిక ఆరోగ్య సర్వే



జన్నారం, డిసెంబర్ 02 (విజన్ ఆంధ్ర) : మాల్యాల్ గిరిజన గ్రామంలో వైద్యాధికారులు జాతీయ మా నసిక ఆరోగ్య సర్వే నిర్వహించారు. నేషనల్ మెం టల్ హెల్త్ సర్వే 2లో భాగంగా అల్ ఇండియా ఇని స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ బిబినగర్, నిమ్హాన్‌బెంగుళూరు వారి ఆధ్వర్యంలో మంగళవారంరోజు న జన్నారం మండలంలోని రోటీగూడ పల్లె దవాఖా న పరిధికి చెందిన మాల్యాల్ గిరిజన గ్రామంలో మా నసిక ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ గ్రామప్రజల మానసిక ఆ రోగ్యస్థితి, జీవనశైలి సమస్యలు, ఆరోగ్య అవగాహ న స్థాయిని అంచనా వేయడం కోసం, చికిత్స అం తరాలను గుర్తించడానికి సర్వే నిర్వహించమని తె లిపారు. మానసిక ఒత్తిడి, వృధ్యాప్య సమస్యలు, మద్యపా నం, మహిళల ఆరోగ్యం, పిల్లల పోషణ వంటి అం శాలపై ప్రత్యేక దృష్టి సారించి మానసిక ఆరోగ్యంపై అవగాహన కోసం బ్రోచర్లు, అవసరమై న చోట ప్రాథమిక వైద్య సలహాలు సూచనలు అం దించి మానసిక సమస్యలకు 14416 టేలిమనస్ నెంబర్ గురించి వివరించమని తెలిపారు .ఈ సర్వే ధ్వారా సేకరించిన సమాచారం జాతీయ మానసిక ఆరోగ్య విధాన రూపకల్పనలో కీలకంగా ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్స్ డాక్టర్ వామన్ కులకర్ణి, మానసిక వై ద్యులు సాయికృష్ణ తిక్క, నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే 2 తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ ఆర్. సునీల్, మెడికల్ ఆఫీసర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉమశ్రీ, గ్రామ ఎమ్ఎల్ హెచ్పి నవనీల, ఏఎన్ఎం పద్మ, ఆశావర్కర్ తిరుమల గ్రామ కార్యదర్శి శ్రీకాం త్, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య బృందం వినిత, గ్రేస్, వేణు మాధురి, రంజిత్ యా దవ్, తిరుపతి, మణి కంట, శ్రీధర్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

## నామినేషన్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

### ఎన్నికల సాదారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాష

వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 ( విజన్ ఆంధ్ర) : వికారాబాద్ జిల్లా పరిధిలో గల వికారాబాద్, నవాబ్ పెట్, మండలాల్లో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశామని ఎన్నికల సాదారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాష అన్నారు. మంగళవారము వికారాబాద్ మండలం సిద్దులూరు, నవాబ్ పేట్ మండలం నవాబ్ పెట్, ఏక్మామిడి గ్రామ పంచాయతీ కార్యాలయాలలో నిర్వహిస్తున్న ఎన్నికల నామినేషన్ ల ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికలను పురస్కరించుకుని గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్‌ను పరిశీలించారు. అవసరమైన వారికి హెల్ప్ డెస్క్ ద్వారా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా అమలయ్యేలా చూడాలని, నిర్ణీత గడువు లోపల నామినేషన్ లు స్వీకరించేందుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కలిపించాలన్నారు. వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు



చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. అనంతరము కల్లెక్టేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను పరిశీలించారు, ఇప్పటి వరకు ఎన్ని కాల్స్ వచ్చాయి, వివరాలు అడుగుతూ రిజిష్టర్ లో తప్పని సరిగా నమోదు చేయాలనీ సూచించారు. సాదారణ పరిశీలకులతో పాటు జిల్లా పంచాయతి అధికారి జయసుధ, డి ఎస్ పి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ డి ఓ వాసు చంద్ర, డిప్యూటీ కలెక్టర్ పూజ ,ఎం పి డి ఓలు కేశబోయిన వినయ్ కుమార్, నవీన్ కుమార్, అనురాధ సంబంధిత అధికారులు , తదితరులు ఉన్నారు.

## టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని

**నూతన డీసీసీ అధ్యక్షులుగా ఎన్నికైన సభ్యులకు సూచనలు చేసిన ఎమ్మెల్యే నాయిని..**

**అందరి అంతిమ లక్ష్యం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి,ప్రజలకు సేవ చేయడమే**

**మరో 10 ఏళ్లు అధికారంలో ఉండేలా కృషి చేసేలా కార్యాచరణ ఉండాలి**

**జెండా పట్టుకున్న కార్యకర్త స్థాయి నుంచి డీసీసీ, ఎమ్మెల్యే వరకు అత్యున్నత స్థానం కల్పించింది కాంగ్రెస్ పార్టీ**



హన్మకొండ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 (విజన్ ఆంధ్ర)హైదరాబాదు లోని గాంధీ భవన్ లో ఈ రోజు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి హాజరైన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు,హనుమకొండ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి ఈ సమావేశంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ,రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ధనసరి అనసూర్య(సీతక్క), వాకిటి శ్రీహరి ,అజారుద్దీన్ ,ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి ,ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్,సచిన్ సవంత్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జెండా మోసిన స్థాయి నుంచి ఎందరో అతిరథ మహారథులు చేపట్టిన డీసీసీ పదవిని 11 ఏళ్లు నిర్విరామంగా పని చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. డీసీసీ అధ్యక్ష పీఠం తల్లిలాంటిదని పార్టీలో మనమంటే నచ్చని వారు సైతం ఉంటారని వారిని కూడా తల్లిలాగా కలుపుకోవాలని,తారతమ్య బేధాలు లేకుండా చూడాలని వెల్లడించారు. డీసీసీ పదవి చేపట్టిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని 100% పార్టీకి,కింది స్థాయి కార్యకర్తలకు వీలైనంత న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అందరినీ కలుపుకొని పోవాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన సభ్యులందరూ పార్టీ కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా ఉండాలని కార్యక్రమలకు సమాచార లోపం లేకుండా చూడాలని సూచించారు. పార్టీలోకి నాయకులకు,ప్రతినిధులను, కార్యకర్తలను ఏబీసీ లుగా చేసుకుని ప్రతి కార్యక్రమానికి ఆహ్వానం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కమిటీ,అనుబంధ సంఘాల నేతలతో నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ అధికంగా ఉంటుందని,గ్రూపు రాజకీయాలకు తావులేకుండా నూతన అధ్యక్షులు చూడాలని సూచించారు. పై స్థాయి నేతల మధ్య సమన్వయ లోపంతో కింది స్థాయి కార్యకర్తలు నారాజు కాకుండా చూసుకోవాల్సిన అనితర బాధ్యత డీసీసీ అధ్యక్షులపై ఉంటుందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన డీసీసీ అధ్యక్షులు సోషల్ మీడియా వారియర్స్ ని కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు. అధికారంలో ఉన్నాం కాబట్టి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధ,సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని వాటన్నింటిని కింది స్థాయి వరకు తీసుకెళ్లడంలో సోషల్ మీడియా కీలకు పాత్ర పోషించిందని పేర్కొన్నారు. లక్షల్లో ఒకరికి వచ్చే గొప్ప అవకాశం డీసీసీ పదవి అని రానున్న ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా,మరో పదేళ్లు అధికారంలో ఉండేలా కృషి చేయాలని నూతన అధ్యక్షులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ,నమిండ్ల శ్రీనివాస్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవి శ్రీనివాస్ రావు,బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,దుద్దిళ్ల శ్రీను బాబు మరియు నూతన డీసీసీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాలి

**7 మండలాల్లోని 144 గ్రామాలు, 1276 వార్డులకు రెండవ విడత నామినేషన్ల స్వీకరణ నేటితో ముగింపు**

**నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

జగిత్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1 (విజన్ ఆంధ్ర) :జగిత్యాల జిల్లాలో 144 గ్రామాలు, 1276 వార్డులకు రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ డిసెంబర్ 2 తో ముగియనున్న నేపథ్యంలో రాయికల్ మండలం వద్దె లింగపూర్, కొత్తపేట మరియు అల్లీపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోని నామినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీస్ బోర్డుపై సక్రమంగా ప్రదర్శించబడ్డాయా అనే విషయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం వరకు ఎన్ని నామినేషన్లు స్వీకరించబడ్డాయి, అలాగే నామినేషన్ల పత్రాలు ఎంతమంది అభ్యర్థులు తీసుకున్నారనే వివరాలను సంబంధిత అధికారుల నుంచి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు



జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. నామినేషన్ స్వీకరణ, రికార్డు నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆయన పలు సూచనలు అందించారు. నామినేషన్ ప్రక్రియ చట్టబద్ధంగా, ఎవరికీ ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు మరియు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై అతికించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు.నవంబర్ 30 నుంచి డిసెంబర్ 2 వరకు రెండవ విడత ఎన్నికల ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. డిసెంబర్ 3 రోజున వీటి పరిశీలన ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 6 వరకు ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. రెండవ విడతలో 7 మండలాల్లోని 144 గ్రామాలు, 1276వార్డుల్లో డిసెంబర్ 14 న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుందని అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఎమ్మార్వో నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలను చైతన్యం చేయాలి జిల్లా ఎస్పీ డి జానకి



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో డిసెంబర్ 2 (విజన్ ఆంధ్ర) సైబర్ నేరాల పట్ల ప్రజలను పోలీస్ అధికారులు చైతన్యం చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డి జానకి ఆదేశించారు. మంగళవారంరాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ అధికారులతో కలిసి ఫ్రాడ్ కు ఫుల్ స్టాప్ అని నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూప్రస్తుత సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు రాష్ట్ర పోలీసు శాఖ కీలక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు Fraud Ku Full Stopఅనే నినాదంతో ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించే ప్రత్యేక కార్యక్రమాన్ని ఆవిష్కరించారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి సైబర్ మోసాలకు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడంపై ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్సై శ్రావణ్ కుమార్, ఐటీ సెల్ SI రవి, డి–4సి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ"సైబర్ నేరాలు రోజుకో రూపం మార్చుకుంటున్నాయి. ఒక్క క్లిక్‌తో పెద్ద నష్టం చోటుచేసుకోవచ్చు. ప్రతి కుటుంబం సైబర్ భద్రత నియమాలను పాటించడం అత్యంత అవసరం" అని పేర్కొన్నారు. ప్రజలు అనుమానాస్పద లింకులు, తెలియని నంబర్ల నుండి వచ్చే సందేశాలు, బ్యాంకింగ్ వివరాలు అడిగే కాల్స్‌కు స్పందించవద్దని ఆమె సూచించారు.మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తోంది:సైబర్ నేరాలకు బారిన పడినప్పుడు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాని, వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని కోరారు.

## దొంగలమర్రి చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్ పి అశోక్ కుమార్

జగిత్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1 (విజన్ ఆంధ్ర) :సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్ పి అశోక్ కుమార్ తెలిపారుజగిత్యాల జిల్లా కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా బార్డర్ వద్ద ఏర్పాటు చేసిన దొంగల మర్రి చెక్‌పోస్ట్ ను ఎస్ పి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తునామని, నగదు, మద్యం, ఉచిత పంపిణీలు, ఇతర ప్రలోభాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నదని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున పోలీసులు అన్ని శాఖల సమన్వయంతో ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్‌ను కఠినంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు."ఓటర్లను ప్రలోభ పెట్టే ఏ చర్యలకు కూడా ఎవరూ పాల్పడవద్దు అని ఎన్నికలకు సంబంధించి అక్రమంగా నగదు, మద్యం లేదా వస్తువులు తరలిస్తే, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు . సరైన ఆధారాలు లేకుండా భారీ మొత్తంలో డబ్బులు తీసుకెళ్తే సీజ్ చేయడం జరుగుతుందని ,అత్యవసర అవసరాలకు నగదు తీసుకెళ్తే తగిన బిల్లులు, పత్రాలు వెంట ఉంచుకోవాలి" అని ఎస్ పి సూచించారు.చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా, పకడ్బందీగా తనిఖీ చేయాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్ పి అధికారులను ఆదేశించారు.






ఎస్ పి వెంట మల్యాల సీఐ రవి, ఎస్ఐ సందీప్, చెక్‌పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## మరోసారి అవకాశం కల్పించండి కొండపల్లి వాసు



కల్లూరు,డిసెంబర్02(విజన్ ఆంధ్ర) మీ అందరి సహాయ, సహకారా లు నాకు అందించి మన గ్రామ పంచాయతీ అభివృ ద్ధితోపాటు మీ అందరికీ సేవ చేసుకొనే అవకాశం కల్పించాలని పేరువంచ నుండి సర్పంచ్ అభ్యర్థిగా బరిలో దిగనున్న మాజీ ఖమ్మం జిల్లా ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ కొండపల్లి వాసు కోరారు. డిసెంబర్ 17న,జరగనున్న పేరువంచ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మీ అందరి సహాయ సహకారాలతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయుచున్నానని తెలియ జేయుటకు సంతోషిస్తున్నాను అన్నారు. గడిచిన 45 ఏళ్లుగా కొండపల్లి కుటుంబానికి రాజకీయం గా,ఆత్మీయంగా ఆదరించి, మాకు అన్ని విధాలుగా అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృద యపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ఎన్నో సందర్భాల్లో నేను, నా కుటుంబ సభ్యులు, నా అనుచరులను ఎన్నికల్లో మీరు నాకిచ్చిన మద్దతు నా జీవితంలో ఎన్నడు మర్చిపోనని, రాజకీయంగా నిలబడ్డానంటే ఆది మీరిచ్చిన ధైర్యం మాత్రమే అన్నారు. త్వరలో జరగనున్న మన పేరువంచ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా పోటీచేస్తున్నాను. మీకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని కొండపల్లి వాసు కోరారు.

## బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్**

హన్మకొండ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 (విజన్ ఆంధ్ర)బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని బీసీ ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హనుమకొండలోని హరిత కాకతీయ హొటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, సామాజిక రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా విధించిన 50 శాతం రిజర్వేషన్లను ఎత్తివేసి బీసీ రిజర్వేషన్లను జనాభా ప్రకారం 42 శాతం పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల తొమ్మిదో తేదీన ఢిల్లీలో ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన పోస్టర్లు జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. బీసీల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్లు అమలు చేయని యెడల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదిరిస్తామని అన్నారు. రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల పాలల్లో 59 సార్లు ఢిల్లీకి వెళ్లారని బీసీల రిజర్వేషన్లపై ఎక్కడ చర్చ జరిపారో చెప్పాలని అన్నారు. రేవంత్ రెడ్డి 60వ సారి ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోడీతో చర్చించాలని బీసీల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. బీసీలకు ఇచ్చిన హామీ నిలుపుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ గౌడ్, బిసి జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు డా. చిర్ర రాజు గౌడ్, డా. సంగాని మల్లేశ్వర్, బోనగాని యాదగిరి గౌడ్, దొడ్డపల్లి రఘుపతి, తమ్మేలా శోభరాణి, మాదం పద్మజ దేవి, తెల్ల సుగుణ, పల్లెపు సమ్మయ్య, అమరావది సారంగపాణి, చిర్ర సుమన్ గౌడ్, కరుణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పథకాలు సాధించిన జగిత్యాల విద్యార్థులు



జగిత్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1 ( విజన్ ఆంధ్ర ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 27,28,29,30 తేదీలలో ఒకినావా మార్షల్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో 28 వ జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించగా 21 రాష్ట్రాలకు చెందిన 800 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో జగిత్యాల ఒకినావా మార్షల్ ఆర్ట్ అకాడమీ కి చెందిన క్రీడాకారులు పాల్గొని 8 పథకాలు సాధించారని జగిత్యాల జిల్లా స్పోర్ట్స్ కరాటే అధ్యక్షులు మర్రిపెల్లి శ్రీనివాస్ తెలిపారుకె. చైతన్య జూనియర్స్ కుమితే ( ఫైట్ ) విభాగంలో బంగారు పథకం, బి. సౌమిత్ రాజ్ వెండి పథకం సాధించగా సి హెచ్. శ్రీనిధి కుమితే ( ఫైట్ ) విభాగంలో బంగారు పథకం, కటా విభాగంలో కాంస్య పథకం, కె. రిషిక కుమితే ( ఫైట్ ) విభాగంలో వెండి పథకం కటా విభాగంలో కాంస్య పథకం ఎం. లాస్యశ్రీ అండర్ -14 ఇయర్స్ కుమితే ( ఫైట్ ) లో కాంస్య పథకం, కటా లో కాంస్య పథకం సాధించారని అన్నారు.పథకాలు సాధించిన విద్యార్థులను ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ ఆఫీసియల్ వసంత్ కుమార్, సీనియర్ కరాటే మాస్టర్ మర్రిపెల్లి లింగయ్య,అనంతుల కాంతారావు తదితరులు అభినందించారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల్లో నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

ఉమ్మడి కరీంనగర్ బ్యూరో డిసెంబర్ 02 (విజన్ ఆంధ్ర)గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులతో ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, పోలింగ్ వరకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకూ తావివ్వకుండా, పారదర్శకంగా సజావుగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికలకు అవసరమైన అన్ని మెటీరియల్స్ సిద్ధంగా ఉండాలన్నారు. మొదటి విడత పోలింగ్ డిసెంబర్ 11న ,రెండవ విడత పోలింగ్ డిసెంబర్ 14 న, మూడో విడత పోలింగ్ డిసెంబర్ 17న జరగనున్న దృష్ట్యా పిఓ ,ఏపిఓలకు, సూక్ష్మ పరిశీలకులకు మరోసారి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నోడల్ అధికారులు అవసరమైతే వారి కార్యాలయం నుండి లేదా ఇతర సిబ్బందిని సహాయకులుగా నియమించుకోవాలన్నారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ల



ముద్రణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం గురించి చర్చించారు.ఎక్కడా అలసత్వానికి తావివ్వవద్దని, ఎన్నికల పట్ల ఎవరైనానిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నియమాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. నోడల్ అధికారులు మరోసారి ఎన్నికల నియమ, నిబంధనలను క్షుణ్ణంగా సరిచూసుకొని పొరపాట్లు దొర్లకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, పంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్‌లో దారుణం.. మూగ బాలుడిపై వీధి కుక్కల దాడి

హైదరాబాద్: హైదరాబాద్‌లోని హయత్‌నగర్ శివగంగ కాలనీలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఏడేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. సుమారు 10 నుంచి 20 కుక్కలు ఎగబడటంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. శునకాల దాడిలో అతని చెవి ఊడిపోవడంతోపాటు తల, నడుము, వీపు భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి.ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతిరావు, చంద్రకళ దంపతులు గత మూడేండ్లుగా శివగంగ కాలనీలో కిరాయికి ఉంటున్నారు. వారి కుమారుడు ప్రేమ్‌చంద్ పుట్టుకతో మూగవాడు. మంగళవారం ఉదయం తండ్రి మేస్త్రీ పనికి వెళ్లగా, తల్లి ఇంట్లో నీళ్లు పడుతున్నది. ఈ క్రమంలో ఇంటి బయట ఆడుకుంటున్న ప్రేమ్‌చంద్‌పై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు వాటిని తరిమేసి బాలుడిని రక్షించారు. అనంతరం అతడిని నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి నిలోఫర్‌కు పంపడంతో అత్యవసర వార్డులో చికిత్స అందిస్తున్నారు. కాగా, నగరంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేస్తున్నాయని, జీహెచ్ఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ దేశానికే తలమానికం : సీఎం

**కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం**

**హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**యూనివర్సిటీ కి మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు**

**ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో తెలంగాణ అగ్రగామిగా ఎదుగుతుంది**

**పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్ఫూర్తితో పని చేస్తున్నాం..**

**సీతారామ ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులు పూర్తి చేస్తాం..**

**యూనివర్సిటీ ని ప్రారంభ వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 02 (విజన్ఆంధ్ర) :ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఎదుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రులు వాకాటి శ్రీహరి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు బలరాం నాయక్, రామ సహాయం రఘురాం రెడ్డిలతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి కి ముందుగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పి రోహిత్ రాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం దేశానికే తలమానికమైన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి ప్రజలకు అంకితమిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల మద్దతుకు ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని అన్నారుగతంలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కోసం వందల ఎకరాల భూమి రైతులు ఇస్తే స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఉపాధి లభించడంతో మొట్టమొదటిసారి తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడింది పాల్వంచ ప్రాంతంలోనని, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ఈ ప్రాంతం అందించిందన్నారు. 60 సంవత్సరాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు ఈ విశ్వ విద్యాలయానికి పెట్టుకోవడం సంతోషంగా ఉందని అన్నారుభారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం అభివృద్ధి చెందడానికి ఎడ్యుకేషన్, ఇరిగేషన్ పాలసీ అమలు చేశారని, ప్రస్తుతం దేశంలో ఉన్న గొప్ప విశ్వ విద్యాలయాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆనాటి ప్రధానమంత్రినెహ్రూ ప్రారంభించినవి అని అన్నారు.బాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరామ్ సాగర్ వరకు నీటి పారుదల ప్రాజెక్టులను జవహర్ లాల్ నెహ్రూ నిర్మించారని తెలిపారు. దేశం మొదటి ప్రధాని స్ఫూర్తితో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ తెలంగాణను దేశ పటం మీద మొదటి స్థానంలో నిలుపుతుందని తమ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు.ఖమ్మం జిల్లాలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను గుర్తించి వాటి మీద పరిశోధనలు జరగాలని ఎర్త్ యూనివర్సిటీ కొత్తగూడెంలో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కొత్తగూడెంకు వైద్య కళాశాల, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం వంటి గొప్ప విద్యాలయాలను ఖమ్మం జిల్లాకు అందించాలని లక్ష్యంతో ముందుకు పోతున్నామని అన్నారు. గోదావరి, కృష్ణ జలాలు ఖమ్మం జిల్లాకు వస్తాయని, ఇక్కడ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల పొలాలకు నీరు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని, సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు పెండింగ్ ఉన్న మిగిలిన అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్ర పాలనకు ఆయువు పట్టు ఖమ్మం జిల్లాలో ఉందని, ఇక్కడ మంత్రులు అనుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదని అన్నారు. ప్రజలకు రేషన్ కార్డు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలు ఇటువంటి అనేక కార్యక్రమాలను ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించామని అన్నారు. భద్రాద్రి శ్రీ రామ చంద్రుని సాక్షిగా ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే విద్యాలయం కు నేడు తొలి అడుగు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దేశంలో ఎక్కడా లేని విధంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేస్తుందని, భూమి పరిసరాలు, భూమి లోపల ఉన్న ఖనిజాల గురించి విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరుగుతాయని, ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే విద్యాలయం లకు నేడు తొలి అడుగు వేసామని అన్నారు. దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి అవసరమైన వసతులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. – ప్రజల తరుపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు : మంత్రి తుమ్మలదేశానికే తలమానికంగా ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశంలో వినూత్న విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించి నందుకు ప్రజల తరఫున సీఎంకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం జిల్లాకు గోదావరి జలాలు, విద్యుత్ కేంద్రం రావాలన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అదనంగా నిధులు మంజూరు చేశారన్నారు. భద్రాద్రి కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతీ హామీలు అమలు : మంత్రి పొంగులేటి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన ఆనాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరిట ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని, ప్రజలు పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి తమ ఆశీర్వాదాలు అందించాలని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజక వర్గంపై ప్రత్యేకమైన ప్రేమతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న, ఎర్త్ యూనివర్సిటీని ఈ ప్రాంతానికి ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని, 800 మెగా వాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదం లభించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విద్యా చందన, వేణుగోపాల్, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఆర్డీఓ మధు, ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యాన్ని...మానసికోల్లాన్ని అందించేది క్రీడలే










విశాఖపట్టణం, డిసెంబర్ 2: ఆరోగ్యాన్ని మానసికోల్లసాన్ని అందించేది క్రీడలే అన్న రీతిలో నేడు విద్యాసంస్థలు చదువులతో పాటు క్రీడలకూ ప్రాధాన్యతనిస్తున్నాయి. ఈ క్రీడా పోటీల్లో సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు మనుమ రాళ్ళు. మనుమడు బహుమతులు సాధించారు. విశాఖ గాజువాక ' ఓక్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ' లో గత రెండు రోజుల పాటు జరిగిన క్రీడా దినోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో వేదుల రాఘవ . శ్రీమతి లలితా జ్యోతి దంపతుల కుమార్తె కృత్తిక (7 వ తరగతి) ఖో ఖో లో ద్వితీయ స్థానం లో సిల్వర్ మెడల్, సర్టిఫికెట్...అలాగే కుమారుడు కార్తికేయ (3 వ తరగతి) రన్నింగ్ రేస్ లో ద్వితీయ స్థానం తో సర్టిఫికేట్, సిల్వర్ మెడల్ పొందారు. హైదరాబాద్ నిజాంపేట్ లోని స్ప్రింగ్ బోర్డ్ స్కూల్ లో జరిగిన క్రీడోత్సవాల్లో నిమ్మరాజు శ్రీవత్సవ కుమార్ – శ్రీమతి నాగజ్యోతి దంపతుల కుమార్తె జోష్విక ప్లేస్కూల్ విభాగం రన్నింగ్ రేస్ నాలుగో స్థానం లో సర్టిఫికెట్ పొందింది.

## రెండేళ్ల కుమారుడుతో కలిసి తల్లి ఉరివేసుకొని మృతి

చేగుంట/ చిన్నశంకరంపేట : తన ఇంట్లో తల్లి రెండేళ్ల కొడుకు ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన చిన్న శంకరంపేట మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజాపూర్ గ్రామానికి చెందిన అఖిల (24) తన రెండేళ్ల కుమారుడు రియాన్స్ గౌడ్ తో కలిసి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అఖిల వివాహమై మూడు సంవత్సరాలు జరగగా, ఏడాది క్రితం రామాయంపేటలో ప్రమాదవశాత్తు భర్త ప్రవీణ్ మృతి చెందాడు. దీంతో తన చిన్నారితో తల్లిగారిల్లులైన నార్సింగి మండలం సంకాపూర్ గ్రామంలో 8 నెలల పాటు ఉండిపోయింది. సోమవారం అఖిల అత్తగారు, బంధువులతో సంకాపూర్ గ్రామానికి వెళ్లి మాట్లాడి ఖాజాపూర్ తన ఇంటికి అత్తగారు తీసుకొచ్చారని తెలిపారు. మంగళవారం ఉదయం పూట ఇంట్లో ఉన్న అఖిల డోర్ పెట్టుకోవడంతో తన అత్త ఇంట్లోకి వెళ్లి చూడగా, డోర్ పెట్టుకొని ఉందని చుట్టుపక్కల వారికి విషయం తెలపడంతో వారు వచ్చి ఇంటి తలుపులు తీయగా అఖిల చిన్నారి కుమారుడు ఉరి వేసుకుని ఉన్నట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న రామాయంపేట సీఐ వెంకట రాజా గౌడ్, చిన్న శంకరంపేట ఎస్సై నారా గౌడ్,స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు.

# ఇటుక బట్టీలో మసిబారుతున్న బాల్యం

# పట్టించుకోని అధికారులు

- అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి
- అక్రమంగా చెరువు మట్టి, విద్యుత్తు వినియోగం
- వాహనదారులకు దుమ్ము, ధూళి, పొగ





నేరేడుచర్ల డిసెంబర్ 02 (విజన్ఆంధ్ర): నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామ శివారులో గ్రామపంచాయతీ అనుమతి లేకుండా లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలలో ఇతర రాష్ట్రాల నుంచి తల్లిదండ్రులతోపాటు వచ్చిన వారి పిల్లలు చదువు సంధ్య లేకుండా బాల కార్మికులుగా ఇటుక బట్టీలలో పనిచేస్తున్నారని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటుక బట్టీల యాజమాన్యం నిబంధనలు పాటించకుండా అక్రమంగా చెరువు మట్టి, విద్యుత్తును వినియోగించుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామపంచాయతీ అనుమతి లేకుండా, గ్రామపంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ సంబంధిత అధికారులకు ముడుపులు చెల్లిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. జానపాడు నుండి నేరేడుచర్లకు వెళ్లే రోడ్డు పక్కన ఇటుక బట్టీలు నిర్వహించడం వల్ల దుమ్ము, ధూళి, పొగతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ బాలలకు నిర్బంధ ఉచిత విద్య అందుబాటులో లేదు. అక్షరాలు దిద్దాల్సిన చేతులు మట్టి కలిపి ఇటుకలు చేస్తున్నాయి. బాల కార్మిక చట్టాలు ఏం చేస్తున్నాయి. వీరి కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేయాలి.

**బాలల హక్కులకు రక్షణ కల్పించాలి :** పుస్తకాలు పట్టాల్సిన బాల్యం నేడు ఇటుక బట్టీలలో మట్టి కలుపుతూ, ఇటుకలు మోస్తూ మగ్గిపోతోంది. ఇటుక బట్టీలో బాల్యం బుగ్గి అవుతుండగా ఆ చిట్టి చేతులు చక్కని రాతకు చదువుకు దూరమవుతున్నాయి. ఒక వైపు కార్మికులకు చాలీ చాలని జీతాలు ఇస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తున్న యజమానులు అది చాలనన్నట్లు చిన్నారులను శ్రమ జీవులుగా మార్చి వేస్తున్నారు. ఇటుకలను తయారీలో నిమగ్నమయ్యారు. ఇటికలు తయారు చేయుటకు కావలసిన మట్టిని కలుపుతూ ఇటుకలను పేరుస్తూ పెద్దలకు ఇటుక పనిలో సహకరించడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. అక్షరాల దిద్దాల్సిన చేతిలో ఇటుకలు ఉండటం పలువురి హృదయాలను కలచివేస్తోంది. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ బట్టిలో ప్రతిరోజు ఉదయం. సాయంత్రం చిన్నారులు పని చేస్తున్నారని ఇతర రాష్ట్రాల నుంచి, వేరే జిల్లాల నుంచి కార్మికులు ఇక్కడికి వచ్చి నెలల తరబడి ఉండడంతో వారితో పాటు చిన్నారులు ఇటుక బట్టీలలోనే వలస కార్మికులుగా తయారవుతున్నారు అని, యజమానులు ధనార్జనే ధ్యేయంగా చిన్నారులను సైతం కార్మికులుగా మారుస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేటి బాలలే భావి భారత పౌరులు అని నానుడి పోయి ఈ బట్టి లలో చిన్నారులు రేపటి కార్మికులుగా తయారవుతున్నారు. ఒకవైపు అక్రమంగా వ్యాపారం చేస్తూ మరోవైపు చిన్నారులను సైతం విచ్చలవిడిగా వెట్టిచాకిరి చేయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొత్త వ్యక్తి బట్టి వైపు వెళ్తే చిన్నారులు ఎవరికీ కనబడకుండా చిన్న చిన్న గుడిసెల్లో దాచుకోవడం పరిపాటిగా మారిందని స్థానికులు అంటున్నారు. అధికారులు ఎవరు అటువైపు చూడరని, నిర్వాహకుల నుండి నెల నెల ముడుపులు భారీగా అందుతున్నాయని స్థానికుల నుండి వెల్లువెత్తుతున్న విమర్శలు, నాయకుల అండదండలు అధికారుల నిర్లక్ష్య ధోరణి వలన ఇటుక బట్టీలు నిర్లక్ష్యంగా విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముడుపుల మత్తులో ప్రశ్నించే వారు లేక ఇష్టానుసారంగా బట్టి నిర్వహిస్తున్నారని, ప్రధాన రహదారిని అనుకుని ఉన్న ఈ బట్టి వైపు ఏ ఒక్క అధికారి గానీ అటువైపు చూడకపోవడం బాధాకర మని, ఉదయం సాయంత్రం బట్టిలలో పదుల సంఖ్యలో చిన్నారులు పని చేస్తు కనబడటం వాహన దారులు ఆశ్చర్యానికి లోనవుతున్నారు. అధికారులు స్పందించి చిన్నారులను వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించాలని పసి హృదయాలను శ్రమజీవులుగా మారుస్తున్న అటువంటి యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బడిఈడూ పిల్లలు బడిలో చదువు నేర్చుకోవాలి అనే ఉద్దేశంతో 6-14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను ప్రభుత్వం అందిస్తుంటే అది అమలు పరచడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బాల కార్మిక వ్యతిరేక చట్టం బాలకార్మికుల నిర్మూలనే ధ్యేయంగా ప్రతి సంవత్సరం జూన్ 12న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్న వివిధ సంఘాలు స్వచ్ఛందంగా పని చేస్తున్న క్షేత్ర స్థాయిలో అమలుకావడం లేదు. ప్రధాన రహదారి వెంట నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేరిన బట్టీలో పదుల సంఖ్యలో చిన్నారులు మగ్గిపోతున్నా, చదువులకు దూరం అయ్యి భవితవ్యం ఛిద్ర మవుతున్నా బట్టి యజమానులు స్వార్ధ ప్రయోజనాలకు, ధనార్జనే ధ్యేయంగా చిన్నారులను కార్మికులుగా మారుస్తున్న అధికారులు అటువైపు గాని చూడకపోవడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ఏటా ఆపరేషన్ స్మైల్ పేరుతో చదువుకు దూరం అవుతున్న చిన్నారులను గుర్తించక పోవడం అధికారుల నిర్లక్ష్యం అని ప్రజలు ఆరోపిస్తున్నారు. బట్టీ నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నా చిన్నారుల బాల్యాన్ని బట్టీలలో ఇటుకలు తయారీకి వినియోగిస్తున్న అధికారులు తనిఖీలు నిర్వహించక పోవడం చర్యలు చేపట్టకపోవడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. బట్టి నిర్వాహకులు ఇచ్చే ముడుపులు అందుకోవడం వలనే ఇటుక బట్టీల వైపు అధికారులు చూడడం లేదని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి నెలనెలా మామూళ్లు మత్తులో సంబంధిత అధికారులు ఉండడం వల్లనే నేడు బట్టీల లో బాల కార్మికులు పెరిగారని వారి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.



ఇకనైనా అధికారులు చిన్నారుల భవిష్యత్తు అంధకారంలో పడకుండా చదువు వైపు దృష్టి సారించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దిర్శించర్ల గ్రామపంచాయతీ కార్యదర్శి వివరణ:

గ్రామపంచాయతీ నుండి ఇటుక బట్టీలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని గ్రామపంచాయతీ కార్యదర్శి వివరించారు.

# కదిలిన యంత్రాంగం

## ప్లాస్టిక్ సామగ్రిని సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు విజన్ ఆంధ్ర కధనానికి స్పందన...




1-2025 | హైదరాబాద్ | 12

కార్పొరేషన్ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేనా..!

నగరంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలు.... పలు దుకాణాల్లో జోరుగా అమ్మకాలు... పట్టించుకోని అధికారులు...

విజన్ ఆంధ్ర

మంచిర్యాల ప్రతినిధి, డిసెంబర్ 01 (విజన్ ఆంధ్ర) : ప్లాస్టిక్ భూతంను తరిమి కొట్టడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముంది. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎంత హాని కలిగిస్తుందో అందరికీ తెలిసిన పదే పదే అదే తప్పు చేస్తుంటారు. ప్లాస్టిక్ వ్యర్థాల తో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాటిని నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. ప్లాస్టిక్ పై కార్పొరేషన్ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేనా ! అనే విజన్ ఆంధ్ర కథనం కు సోమవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల యంత్రాంగం కదిలింది. పలు ప్లాస్టిక్ విక్రయించే దుకాణాల్లో మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇనస్పెక్టర్ వైకుంఠం తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. సుమారు రూ 10 వేల విలువగల ప్లాస్టిక్ సామగ్రిని సిజ్ చేశారు. ప్లాస్టిక్ విక్రయించరాదని హెచ్చరించారు. రెండవసారి పట్టుబడితె భారీ జరిమానా విధించడం జరుగుతుందని సూచించారు.

# మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

## ఎమ్మెల్యే పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ





శేరిలింగంపల్లి. డిసెంబర్ 2 ( విజన్ ఆంధ్ర): శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ లోని కుడి కుంట చెరువు అలుగు నుండి ప్రభు పాద లే ఔట్ వరకు రూ. 3 కోట్ల 96 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే బాక్స్ డ్రైన్ (వరద నీటి కాల్వ) నిర్మాణం పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఇరిగేషన్ మరియు జలమండలి అధికారుల తో కలిసి పరిశీలించిన పిఏసి చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం కుడి కుంట చెరువు అలుగు నుండి ప్రభు పాద లే ఔట్ వరకు రూ. 3 కోట్ల 96 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే వరద నీటి కాల్వ నిర్మాణం పనులను పరిశీలించడం జరిగినది అని, వరద ముంపు నుండి కాలనీ వాసులకు ఉపశమనం లభించింది అని, మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని , శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అగ్రభాగాన నిలబెడుతామని పిఏసి చైర్మెన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఈ ఈ శిరీష, డి ఈ ఆనంద్ నాయకులు మా రబోయిన రాజు యాదవ్, మల్లేష్ యాదవ్, కోడిచెర్ల రాములు, శశాంక్, పవన్ కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# బిసి సంక్షేమ సంఘం నాయకులను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు





కరీంనగర్ డిసెంబర్ 02 : కరీంనగర్ లోని డిసిసి కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేయడానికి వెళుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు , బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ , రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి ఎస్ ఆనంద్ , జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషలక్ష్మి , జిల్లా కన్వీనర్ మియాపురం రవీంద్ర చారి తోపాటు బీసీ సంక్షేమ అనుబంధ సంఘ నాయకులను సీఐ సృజన్ రెడ్డి గారుముందస్తు అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ మాట్లాడుతు రేపు హుస్నాబాద్ లో నిర్వహించే సీఎం ప్రోగ్రాం అడ్డుకుంటామని వారు తెలిపారు. సీఎం కామారెడ్డి లో ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ల డిక్లరేషన్ను రేపటి సభలో ప్రసంగించాలని లేనిపక్షంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని అన్ని బీసీ సంక్షేమ అనుబంధ సంఘ నాయకులు కుల సంఘాల నాయకులు ప్రధాన రాజకీయ పార్టీ నేతలు అందరం కలిసి నిరసన వ్యక్తం చేస్తూ సభ ముట్టడి చేస్తామని వారు తెలిపారు. డిసెంబర్ 8 , 9 వ తేదీన ఢిల్లీలో జరిగే జంతర్ మంతర్ వద్ద మహాధర్నా పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి వేలాదిమంది తో తరలి వెళ్తున్నామని వారు తెలిపారు. త్వరలో బీసీల కార్యాచరణను ప్రకటిస్తామని వారు తెలిపారు.

# జిల్లా కలెక్టర్ ను సన్మానించిన టీఎన్జీవో



కరీంనగర్ డిసెంబర్ 02 : ప్రజాసేవ, పరిపాలన, వినూత్న కార్యక్రమాల రూపకల్పనలో చేసిన విశిష్ట కృషిని గుర్తిస్తూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రతిష్ఠాత్మక భారత్ గౌరవ్ అవార్డు ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదలు, అనాధలు, బలహీన వర్గాల కోసం కృషి చేస్తున్నాం జిల్లా కలెక్టర్ కు ఈ అవార్డు రావడం సంతోషకరమైన విషయమని అన్నారు. కరీంనగర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనాథ బాలికకు వివాహం నిర్వహించడం మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచిందన్నారు. శుక్రవారం సభ పేరిట ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం మహిళల అభ్యున్నతికి ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందనే భావనతో ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా మహిళలందరికీ 50 వేల ఖరీదైన ఉచిత వైద్య పరీక్షలు చేయించడం గొప్ప విషయమని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నూతన ప్రోత్సాహం ఇస్తూ, మళ్లీ బడిబాట పట్టించే ప్రత్యేక మార్గదర్శక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. పనిచేసే ప్రాంతపు భాష, సంస్కృతులను స్వయంగా నేర్చుకుంటూ ప్రజల మనసుల్లో స్థానం సంపాదించిన అరుదైన అధికారిణి పమేలా సత్పతి గారేనని అన్నారు. బధిర విద్యార్థుల అవసరాలను అర్థం చేసుకోవడానికి స్వయంగా సైన్ లాంగ్వేజ్ నేర్చుకుని దివ్యాంగుల కోసం విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. **RNI.NO.70731/1999** EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.